తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# గుర్తింపు ఎప్పుడిస్తారో!?

## నామినేటెడ్ పదవుల కోసం తెలుగుతమ్ముళ్ళ ఆశలు



ప్రభాతవార్త-తిరుపతి: అధికారంలో ఉన్న ఎన్డిఎ కూటమి ప్రభుత్వం ఏడ్చేపిల్లవాడికి వెలక్కాయ చూపారనే చందంగా పార్టీకోసం ప్రాణాలు అర్పించే స్థాయిలో కష్టపడ పనిచేసిన నేతలు, కార్యకర్తలకు గుర్తింపు లేకపోతోందని పలువురు టిడిపి కేడర్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన ఐదునెలలు కావస్తున్నా ఇప్పటికీ ప్రాధాన్యత ఉన్న, హోదా కల్గించే నామినేటెడ్ పదవులు పేరుతో దోబూచులాడుతున్నారు. సోమవారం తిరుపతిలో జరిగిన ఇన్ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎదుట పలువురు తెలుగుతమ్ముళ్ళు తమ మనోభావాలు, అభిప్రాయాలు వ్యక్తం చేయడం విశేషం. రాష్ట్రంలో ఎన్డిఎ కూటమి తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటై ఐదునెలలు కావస్తున్నా పార్టీకోసం కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు కట్టబెట్టడం మరింత ఆలస్యం కానుంది. ఇప్పటికే ఈ పదవుల పందేరంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్కల్యాణ్ కసరత్తుచేశారు. కొన్ని నియోజకవర్గాల్లో టిడిపి నేతలకు 60శాతం, జనసేన నేతలకు 30శాతం, బిజెపి నేతలకు 10శాతం లెక్కన పదవులు ఇవ్వనున్నారనే ప్రచారం మూడునెలలుగా సాగుతూనే ఉంది. ఈనెలలోనే పలు పలు నామినేటెడ్ పదవులు ప్రకటించారు. తిరుపతి జిల్లా నుండి యువనేత, తెలుగుయువత రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎ.రవినాయుడుకు శాప్ ఛైర్మన్ పదవి లభించింది. ఇంకా పలు పదవులకు తెలుగుతమ్ముళ్ళు ఆశతో ఎదురుచూశారు. అయితే కూటమి పార్టీలో కుదరని సయోధ్యతో కీలక పదవులు టిడిపి నేతలకు ఇవ్వాలనేది తెరపై ఉన్న డిమాండ్, ఇదే విషయాన్ని అధినేత చంద్రబాబునాయుడును కలసి పలువురు సీనియర్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు, గత ఎన్నికల్లో టిక్కెట్లు వదలుకున్న నేతలు అందరూ తమకు న్యాయం చేయాలని విన్నవించారు. అయితే అవసరం బట్టి అందరికీ మంచి చేస్తానని, దీనిపై కసరత్తుచేశానని అందరికీ చల్లని కబురు చెప్పి సంతోషపరుస్తున్నాడేగానీ నాలుగునెలలుగా పదవులు కట్టబెట్టలేదనే అంతర్మథనంతో నలిగిపోతున్నారు. చాంతాడంత జాబితాతో టిడిపిలో పార్టీకోసం కష్టపడి పనిచేసి వారినందరినీ సంతృప్తి పరచలేక అధినేత తలపట్టుకునే పరిస్థితి ఏర్పడింది. తిరుపతి నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే గెలిచినా ఇక్కడ టిడిపి నేతలతే బలం ఉంది. టిడిపి సహకరిస్తేనే ఆరణి గెలిచాడనేది బహిరంగంగా చంద్రబాబు కూడా చేసిన సర్వేలో వెల్లడైన విషయం. ఈ నేపథ్యంలో తిరుపతి నియోజకవర్గంలో మూడు దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని కష్టపడి పనిచేస్తున్న వారికి, కష్టకాలంలో పార్టీని వెన్నంటే ఉన్న వారికి ఎంతవరకు న్యాయం చేస్తారనేది ఇప్పుడు అందరిలోనూ ఉత్కంఠతే. తిరుపతిజిల్లాలో ఎంతో ప్రాధాన్యత ఉన్న తుడ ఛైర్మన్ కుర్చీ,టిటిడి బోర్డులో సభ్యులు, గంగమ్మఆలయ ఛైర్మన్, పాలకమండలి, రవాణాశాఖ ,కులసంఘాల పదవులు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్, ఆర్టీసి ,రైల్వే ప్రయాణీకుల సంక్షేమ కమిటీ ,మహిళ కమిషన్ ఛైర్పర్సన్, సభ్యులు, అంగన్వాడీ అభివృద్ధి కమిటీలు, మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ల వంటి కీలకమైన నామినేటెడ్ పదవులు భర్తీ చేయాల్సి ఉంది. ఈ పదవులన్నీ ఇప్పుడు ఎవరికి దక్కుతాయనేది మరో పదిరోజులు టెన్షన్. రెండవ విడతలో మరీ ఎంతమందికి పదవులు వరిస్తాయనేది కూడా ఆశతో చూస్తున్నారు.

## అడవిపందుల స్వైరవిహారం-వరిపంటకు తీవ్ర నష్టం



చౌడేపల్లి, అక్టోబర్ 28 ప్రభాతవార్త అడవిపందులు స్వైరవిహారం విహారం చేయడంతో వరిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని చారాల పంచాయతీ బీర్జేపల్లికి చెందిన మిద్దింటి గోపి, గురునాథ్, వెంకట్రమణ తదితరులు గ్రామానికి సమీపంలోని మోతుగులకుంట వద్ద 5ఎకరాలు వరిసాగు చేసారు. రెండు రోజుల నుంచి అడవిపందుల బెడద అధికంగా వుందని రైతులు తెలిపారు. రాత్రిళ్ళు కాపలా వున్నప్పటికీ దాదాపు 2ఎకరాల మేర ధ్వంసం చేశాయని రైతులు వాపోయారు. వ్యవసాయం జూదంలా మారిన ప్రస్తుత సమయంలో అప్పులు చేసి వరినాట్లు వేశామనీ, చేతికందే సమయంలో అడవి పందులు పొట్టన పెట్టుకొన్నాయన్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

# క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాలు అందిస్తాం!

## పార్టీలో పనిచేసిన వారికి పదవులు - తిరుపతిలో కూటమి నేతలతో ఇన్ఛార్జిమంత్రి అనగాని



తిరుపతి,అక్టోబర్ 28ప్రభాతవార్త: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డిఎ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 130రోజుల పాలనను పూర్తిచేసుకున్నామని, ప్రజలకు మంచి చేయాలనే తపనతోనే ముఖ్యమంత్రి అవిరామ కృషిచేస్తున్నారని తిరుపతి జిల్లా ఇన్ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సూపర్సిక్స్ పథకాలు, ఫెన్షన్ పెంపు, రేషన్సరఫరా, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి అమలవుతున్న పథకాలు గురించి క్షేత్రస్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు ప్రజలకు తెలియజేయాలని జిల్లా ఇన్ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. తిరుపతి జిల్లా ఇన్ఛార్జి మంత్రిగా నియమితులైన అనగాని సత్యప్రసాద్ తొలిసారిగా సోమవారం ఉదయం తిరుపతికి చేరుకున్నారు. ఇక్కడ తిరుపతిజిల్లాకు చెందిన టిడిపి ఎమ్మెల్యేలు, జనసేన ఎమ్మెల్యే, తిరుపతి జిల్లా టిడిపి నేతలు ఘనస్వాగతం పలికారు. సోమవారం మధ్యాహ్నం జిల్లాకు చెందిన పార్టీల నేతలు, రాష్ట్రస్థాయి నేతలతో ఓ హోటల్లో మంత్రి సమావేశమయ్యారు. జగన్ కుటుంబ వివాదంతో మాకు సంబంధంలేదని, తిరుపతి జిల్లాలో సత్యవేడు నియోజకవర్గంలో కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తామన్నారు. పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని మంత్రి ఉద్ఘాటించారు. దీపావళికి ఉచిత సిలిండర్లు అమలుచేసి పండుగరోజు మహిళలు ఆనందంగా ఉండాలనేది చంద్రబాబు ఉద్దేశ్యమన్నారు. అనంతరం తిరుపతి జిల్లాల్లో ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులతో సుదీర్ఘసమావేశమయ్యారు. పలువురు తమతమ అసంతృప్తులను, పదవులు గురించి ఏకరవుపెట్టారు.

### తప్పుడు ధృవీకరణ పత్రాలు సమర్పించారనే అభియోగంపై

# కాణిపాకం ఆలయ ప్రధాన అర్చకులు సస్పెన్షన్



సోమశేఖర్ గురుకుల్ ఫోటో(ఫైల్ పోటో)

కాణిపాకం, అక్టోబర్ 28 ప్రభాతవార్త: ఉద్యోగంలో ప్రవేశానికి...ప్రధాన అర్చకుడిగా పదోన్నతి పొందేందుకు తప్పుడు ధృవీకరణ పత్రాలను దేవస్థానంకు సమర్పించారనే అభియోగంపై రాష్ట్ర దేవాదాయశాఖ కమీషనర్ ఆదేశాల మేరకు దేవస్థానం ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ను సస్పెన్షన్ చేస్తూ ఆలయ అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థానం ప్రధాన అర్చకుడిగా పనిచేస్తున్న సోమశేఖర్ గురుకుల్ దేవస్థానంలో ఉద్యోగంలో చేరేందుకు, అనంతరం ప్రధాన అర్చకుడిగా పదోన్నతి పొందేందుకు తప్పుడు ధృవీకరణ పత్రాలను దేవస్థానంకు సమర్పించారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికంగా వున్న న్యాయవాది ఒకరు రాష్ట్ర దేవాదాయ దర్మాదాయశాఖ కమీషనర్కు గత ఆరు నెలల క్రితం ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలని కమీషనర్ గత ఈఓను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు గత ఈఓ వెంకటేశు విచారణ జరిపి కమీషనర్కు గత కొంత కాలం క్రితం నివేదిక అందజేశారు. అయితే ఈనివేదికపై కమీషనర్ ఎటు వంటి చర్యలు తీసుకోకపోవడంతో న్యాయవాది దేవాదాయశాఖ కమీషనర్పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఈమేరకు సోమశేఖర్ గురుకుల్ ఉద్యోగంలో చేరేందుకు, ప్రధాన అర్చకులుగా పదోన్నతి పొందేందుకు తప్పుడు ధృవీకరణ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు రుజువు కావడంతో సదరు అర్చకుడిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గత రెండు మూడు రోజులు క్రితం కమీషనర్ నుండి దేవస్థానంకు ఆదేశాలు అందాయి. ఈమేరకు సోమ వారం ప్రధాన అర్చకుడిగా వున్న సోమశేఖర్ గురుకుల్ను సస్పెన్షన్ చేస్తూ ఆలయ పట్టెం గురుప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమశేఖర్ గురుకుల్ స్థానంలో దేవస్థానంలో ముఖ్య అర్చకుడిగా పనిచేస్తున్న గణేష్ గురుకుల్ను ఇన్చార్జి ప్రధాన అర్చకుడిగా నియ మిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ ఈఓ 'ప్రభాతవార్త'కు తెలిపారు.

### కన్నుల పండువగా

# స్నపన తిరుమంజనం

## వైభవంగా కళ్యాణ వెంకన్న పవిత్రోత్సవాలు



చంద్రగిరి, అక్టోబర్ 28 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడుకి స్నపన తిరుమంజనం కన్నుల పండువగా జరిగింది. కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలను ఆగమోక్తంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను యాగశాలకు వేంచేపు గావించారు. వైధిక కార్యక్రమాలలో భాగంగా పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం, అన్నప్రానాయానం నిర్వహించారు. తదుపరి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాధ్, సూపరింటెండెంట్స్ తేనెపల్లి వెంకటస్వామి, వల్లంశెట్టి రమేష్కుమార్, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఆలయ అర్చకులు పార్ధసారధి, బాలాజీ రంగకుమార్, నారాయణం శేషాచార్యులు, కేనమాకుల పల్లి నారాయణాచార్యులు, అసిస్టెంట్ మోహన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి కేసులో విద్యార్థి అరెస్టు

## 150 గ్రాముల గంజాయి స్వాధీనం

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 28, ప్రభాతవార్త

తిరుపతి జిల్లా ఎస్పి ఉత్తర్వులు మేరకు గంజాయి అమ్మేవారిపై ఉక్కుపాదం మోపి వాటిని అరికట్టాలనే ఆదేశాల మేరకు సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజాయి గురించి రాబడిన సమాచారంతో తిరుపతి రూరల్ తహశీల్దార్ వారితో పాటు తాటితోపు రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో ఇద్దరు వ్యక్తులు పారిపోవుటకు ప్రయత్నం చేయగా సిబ్బంది సహాయంతో చుట్టు ముట్టి పట్టుకొని తాటితోపుకు చెందిన బిసిఏ ఫైనల్ విద్యార్థి మక విష్ణువర్ధన్ (21) సంవత్సరాలు అను వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుండి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తిరుపతి రూరల్ ఎస్ఐ గోవిందు తెలిపారు. అతనిని అదుపులో తీసుకుని విచారించగా అతను నగిరికి చెందిన శివకుమార్ వద్ద కొనుక్కొని వాటిని తోటి విద్యార్థులకు ఎక్కువ రేటుకు అమ్ముతూ సంపాదిస్తున్నానని తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి అతనిని రిమాండ్కు పంపుతున్నట్లు తెలిపారు. ఇంకొక ముద్దాయి పరారీలో ఉన్నారు. అతనిని కూడా తొందరలోనే అరెస్టు చేస్తామన్నారు. గంజాయి మత్తులో పడి విద్యార్థులు వారి జీవితం నాశం చేసుకోవడమే కాక మిగత విద్యార్థులను కూడా వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని తల్లిదండ్రులు కూడా వారిని గమనిస్తూ ఉండాలని తిరుపతి రూరల్ ఎస్ఐ గోవిందు కోరారు.

# వ్యక్తి అనుమానస్పద మృతి!



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 28 ప్రభాతవార్త : తిరుపతి రూరల్ మండలంలోని ఓ ప్రైవేటు లాడ్జిలో ఒక వ్యక్తి అనుమానస్పంద మరణంగా కేసు పోలీసులు నమోదు చేసినట్లు తెలిపారు. తిరుపతి పట్టణం, శ్రీపురం కాలనీలో నివాసం ఉంటున్న ఆర్.వెంకటప్రసాద్ 2012సంవత్సరంలో మాధురి అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇతర ఓ ప్రైవేటు బ్యాంకులో డిప్యూటీ మేనేజర్గా, భార్య టిటిడిలో సెక్యూరిటీ వింగ్లో సిసీటీవి అపరేటర్గా ఉద్యోగం చేస్తున్నారు. అయితే వెంకటప్రసాద్కు సుమారుగా 40లక్షలు అప్పులు వున్నట్లు, జీవిత బీమా కూడా చేసుకువున్నట్లు తెలిపారు. భార్యతో అప్పుడప్పుడు విరక్తితో మాట్లాడే వాడని, దీంతో సోమవారం ఉదయం ఓ ప్రైవేటు లాడ్జిలో రూము తీసుకున్నాడని, సాయంత్రం వరకు ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో అనుమానంతో వెతకడం ప్రారంభించారని తెలిపారు. సాయంత్రానికి ఓ ప్రవేటు లాడ్జి వద్ద ఓ వ్యక్తి ఫ్యాన్కు ఉరివేసుకొని చనిపోయాడనే సమాచారం రావడంతో, అక్కడికి వెళ్ళిన చూడడంతో వెంకట ప్రసాద్ అని నిర్ధారించుకున్నారు. వెంకటప్రసాద్ సోదరుడు ఆర్.భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇది అనుమానస్పద మరణంగా తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

# హైకోర్టు జడ్జిగా సత్యవేడు పట్టణ వాసి



సత్యవేడు, అక్టోబరు 28 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా తిరుపతి జిల్లా సత్యవేడు పట్టణ వాసి ప్రముఖ న్యాయవాది తూటా చంద్రశేఖర్ కుమారుడు ధనశేఖర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు ప్రాంగణంలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ం ఠాకూర్ హై కోర్టు న్యాయమూర్తిగా కొత్తగా నియమితులైన తూటా చంద్ర ధనశేఖర్తో పదవీ బాధ్యతలు చేయించారు. చంద్ర ధనశేఖర్తో పాటు న్యాయమూర్తులుగా నియమించబడిన మరో ఇద్దరితో కూడా హై కోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పదవీ బాధ్యతలు చేయించారు. పదవీ ప్రమాణ స్వీకారోత్సవానికి పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో హై కోరు న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తూటా చంద్ర ధనశేఖర్ని తిరుపతి జిల్లా సత్యవేడు మండలం స్థానికులు మస్తాన్ యాదవ్, లాయర్ వెంకటేశ్వరులు, ఊరందుల సాయి, రాంబాబు యాదవ్, ప్రతిమ సుశీల్ కుమార్రెడ్డి, రఘుపతి రెడ్డి, లాయర్ వేలు, హై కోర్టు న్యాయవాది వినోద్ తదితరులు అభినందనలతో అష్ట వ్యక్తం చేస్తున్నారు. హై కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన తూటా చంద్ర ధనశేఖర్ సత్యవేడులో ప్రముఖ న్యాయవాదిగా కొనసాగుతున్న చంద్రశేఖరన్ కుమారుడు ఈ నేపథ్యంలో హై కోర్టు న్యాయమూర్తిగా పదవీ బాధ్యత స్వీకరించిన తూటా చంద్ర ధనశేఖర్కు స్థానిక న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పద్మావతిఅమ్మవారి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

### -భక్తులకు సంతృప్తికర సౌకర్యాలు: ఈఓ శ్యామలరావు



తిరుచానూరు, అక్టోబర్ 28ప్రభాతవార్త: తిరుచానూరులో వెలసిన పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లుచేయాలని, భక్తులకు సౌకర్య వంతంగా అన్ని సదుపాయాలు కల్పించా లని టిటిడి ఈఓ జె.శ్యామల రావు అధికారులను ఆదేశించారు. బ్రహ్మో త్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. నవంబర్ 28నుండి డిసెంబర్ 6వతేదీ వరకు జరిగే అమ్మవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, ఆలయం ముందు, ఆలయ మాఢవీధులు, తోళప్పగార్డెన్స్, శిల్పారామం ప్రాంతాల్లో ఏర్పాట్లు, పుష్పాలంకర ణలు, వాహనసేవల విశేషాల్లో భక్తులకు దర్శనాలు వంటివాటిపై ఈఓ సమీక్షించారు.

# అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవు : ఎస్పి



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 28, ప్రభాతవార్త

అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్ర యించినా చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్పి సుబ్బరాయుడు హెచ్చరించారు. నిర్వాహకులు ప్రభుత్వం సూచించి నియమనిబంధనలు, జాగ్రత్తలు తప్పక పాటించాలని, నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవన్నారు. లైసెన్స్లు కలిగిన దుకాణదారులు మాత్రమే బాణసంచా విక్రయాలు చేయాలని, నీరు, ఇసుక, తదితర అగ్ని మాపక సామాగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జనావాసాలకు, విద్యా సంస్థలకు, హాస్పిటల్స్కు, ప్రజల నివాస ప్రాంతాలలో టపాకాయలు విక్రయించరాదని, పట్టణ మండల సుదూరు ప్రాంతాలలో మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు, నిల్వల సమాచారాన్ని గానీ, ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, సహాయం అవసరమైనా, అత్యవసర సమయంలో ఫైర్ స్టేషన్కు 100, డయల్ 112, కంట్రోల్ రూమ్ 8099999977లకు తెలియజేయాలని సూచించారు.

# స్వామీజీల ఆరోపణలు సరికాదు

## టిటిడి

తిరుమల, అక్టోబర్ 28ప్రభాతవార్తప్రతినిధి: అడిగిన దర్శనం టిక్కెట్లు పెద్దసంఖ్యలో జారీచేయలేదని. తమవారికి దర్శనాలు చేయించలేదని శ్రీకాకుళంజిల్లా కృష్ణాపురంగ్రామం ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానందసరస్వతిస్వామిచేసిన ఆరోపణలు సరికాదని టిటిడి ఖండించింది. అదనపు ఈఓ పేరుచెప్పి స్వామి ఆరోపణలు చేయడం,విమర్శలకు దిగడం మంచిదికాదన్నారు. ఆ స్వామి ఏకంగా ఆదివారం భక్తుల రద్దీ అదికంగా ఉన్న సమయంలో 50మందికి బ్రేక్ దర్శనం, 550మందికి ప్రత్యేక ప్రవేశ దర్శనంతోబాటు తిరుమలలో వసతి కల్పించాలని టిటిడి అధికారులను కోరారు. అయితే ఆయన అడిగిన విధంగా వసతి కల్పించేందుకు అంగీకరించారు.సాధారణంగా అంతమందికి బ్రేక్ దర్శనం ఇవ్వడం సాధ్యంకాదని, 600మందికి కాదని, సంఖ్యను కుదించాలని కోరారు. అయితే ఆయన అందరికీ దర్శనం ఇవ్వాలని పట్టుబట్టారు. దీనిపై స్వామి సోమవారం మీడియాతో టిటిడి అధికారిపై తీవ్రస్థాయిలో కించపరుస్తూ మాట్లాడటం మంచిదికాదని, ఇది స్వామికి తగదని టిటిడి ఒక ప్రకటనలో పేర్కొంది.

# శివాలయంలో దీపం వెలిగించాలి: భక్తుల మనోభావం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 28 ప్రభాతవార్త శివాలయంలో దీపం వెలిగిస్తే మంచిదనే మనోభావం భక్తులు ఉంది.దాంతో అధికారులు, పోలీసులు ఎన్ని ఆంక్షలు, నిబంధనలు విధిస్తున్నా భక్తులు ఖాతరు చేయటం లేదు.కొత్తగా రాత్రి రెండు గంటల నుంచే శివాలయానికి సమీపంలోని గుడుల వద్ద దీపాలు వెలిగిస్తున్నారు. అయితే కార్తీక మాసమే కాదు. ఈ దివ్యక్షేత్రానికి వచ్చిన ప్రతి ఒక్కరు దీపం వెలిగించాలని భావిస్తారు. కానీ గత పాలకమండలి హయాంలో నాణ్యత లేని నేతి దీపాలు వ్యాపారులు విక్రయిస్తున్నారనే ఆరోపణలతో దేవస్థానం ఖరారు చేసిన నేతినే వాడాలని అప్పటి అధికార పార్టీ నాయకులు వ్యాపారం చేసారు. ఇది కూడా ఎంతో కాలం సాగలేదు. చివరకు దీపాలనే నిషేధించారు. భక్తుల మనోభావాలకు వ్యతిరేకంగా తీసుకున్న ఏ నిర్ణయం మనుగడ సాగించలేదటానికి నేడు భక్తులు ఆచరిస్తున్న 'దీపాల వెలిగింపే' ప్రత్యక్ష సాక్ష్యం.

**వినాయక గుడి వద్ద దీపాలు:**



శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధికి వచ్చిన వారు ఎక్కడ దీపాలు వెలిగించుకోవచ్చో దేవస్థానం ప్రకటించలేదు.దాంతో వచ్చిన భక్తులు తీవ్ర నిరాశకు గురౌతున్నారు.ఈ నేపథ్యంలో వచ్చిన భక్తులు తేరువీధి, దిగువ సన్నిధివీధుల్లో దీపాలు ఎక్కడ వెలిగించాలని వ్యాపారులను ఆడగటంతో వారు తేరువీధిలోని రాజగోపురం ఎదురుగా ఉన్న వినాయక ఆలయం, సన్నిధివీధిలో రామాలయం పక్కనే ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద వెలిగించవచ్చుని చెప్పటంతో భక్తులు అక్కడ పోలోమని దీపాలను వెలిగించి తమ మొక్కులను తీర్చుకుంటున్నారు. కొన్ని ఆలయాల్లో కొన్ని సంప్రదాయాలు, కొన్ని ఆలయాలంటే భక్తుల మనస్సుల్లో భావం ఉంటుంది. ముఖ్యంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వామి స్వయంభువు.కాబట్టి ఆయనకు దీపం వెలిగించాలని భావిస్తున్నారు.దాంతో వచ్చిన భక్తులు దివ్యక్షేత్రంలో ఎక్కడో ఒక చోట దీపాలు వెలిగించాలని భావించి తేరువీదిలోని వినాయక ఆలయం వద్ద దీపాలు వెలిగించి మొక్కుకుంటున్నారు. అధికారులు,పాలకులు భక్తుల మనోభావాలకు అనుగుణంగా ప్రత్యేక షెడ్డును ఏర్పాటు చేసి వచ్చిన భక్తులకు కృష్ణారెడ్డి మండపంలోని సమాచారం కేంద్రం వద్ద పెద్ద పెద్ద బోర్డులు ఏర్పాటు చేస్తే భక్తులకు సమాచారంతో పాటు దోపిడి తప్పుతుంది. రోడ్ల మీద దీపాలు వెలిగించటం పోలీసుల, సెక్యూరిటి సిబ్బంది హంగామా సృష్టించటం ఉండదు.

## చోరీ కేసులో నిందితుడి అరెస్టు

**పలమనేరు, అక్టోబర్ 28, ప్రభాతవార్త:**



బైరెడ్డిపల్లెలో చోరీ కేసులో ఓ వ్యక్తి అరెస్టు చేసి అతని వద్ద నుండి రూ.1.80 లక్షల నగదును సిఐ మురళీమోహన్ రికవరీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న వీరభద్ర ఇంటిలో చోరీ జరిగినట్లు ఫిర్యాదు రావడం జరిగిందని తెలిపారు. దీనిపై విచారణ చేపట్టే క్రమంలో దేవదొడ్డి బస్టాండు వద్ద పాండురంగ అనుమానంగా తిరుగుతుంటే ఆతనిని అదుపులో తీసుకుని విచారణ చేయగా ఆ చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడని ఆతని వద్ద నుండి రూ.1.80లక్షలు నగదు, వెండి పట్టీలు స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండుకు తరలించామని తెలిపారు. రికవరీ చేసిన నగదు, వెండి పట్టీలను వీరభద్రకు అందజేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం సన్నిధిలో ముంబాయి హైకోర్టు న్యాయమూర్తి

**కాణిపాకం, అక్టోబర్ 28 ప్రభాతవార్త:**



ముంబాయి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాంగేష్ ఎస్ పాటిల్ సోమవారం కుటుంబసమేతంగా కాణిపా కం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకు న్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదల తో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

**రామకుప్పం, అక్టోబర్ 28 ప్రభాతవార్త**



స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికాభి వృద్ధి సాధించాలని తెదేపా రాష్ట్ర నేతలు మున స్వామి, పత్ర నారాయణ, మండల టిడిపి అధ్యక్షు డు ఆనందరెడ్డి కోరారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో సోమవారం నూతన విఒ లీడర్ల ఎంపిక జరిగింది. వారు మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వం అందిం చే రాయితీ రుణాలు, పథకాలు సద్వినియోగం చేసుకుని చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుచేసుకుని ఆర్థి క అవకాశాలు మెరుగుపరచుకోవాలన్నారు. ప్రభుత్వం తరపున మహిళ లకు తగు సహాయ సహకారాలు తప్పక అందుతాయన్నారు. కార్యక్రమంలో ఎపిఎం శ్రీనివాసమూర్తి, నేతలు నరసింహులు, రామూర్తి, సీతాపతి, చలపతి, మనోహర్, కామరాజునాయక్, విశ్వనాథ్, చంద్రశేఖర్‌రెడ్డి, బాలరాజు, సుబ్రి, వెంకటరమణ, మంజునాథ్, సురేష్, ఆదిల్, గజేంద్ర పాల్గొన్నారు.

## పండగ వాతావరణంలో సభ్యత్వ నమోదు

**వి.కోట, అక్టోబర్ 28 ప్రభాతవార్త**



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో వి.కోట మండలంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అధ్వ ర్యంలో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో ప్రారంభించారు. స్థానిక శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం సభ్యత్వ నమోదును మాజీ ఎఎంసి ఛైర్మన్ రామచంద్రనాయుడు, మండల టిడిపి అధ్యక్షుడు ఎఎం రంగనాథ్ ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు ఈశ్వర్, రాంబాబు, సుబ్బన్న, ధీరజ్, గౌస్‌పీర్, హరినాథరెడ్డి, నారాయణస్వామి పాల్గొన్నారు.

## ఎల్ఐసి ఏజెంట్ల నిరసన

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 28 ప్రభాతవార్త** అక్టోబర్ 1 నుంచి భోజన విరామసమయంలో ఎల్ఐసి ఏజెంట్లు నిరసన కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ యాజమాన్యం ఎల్ఐసి ఏజెంట్లు సమస్యల పట్ల సానుకూల స్పందన లేకపోవడం మరియు సమస్యలకు ఎలాంటి పరిష్కారం చూపకపోవడంతో సోమవారం స్థానిక ఎల్ఐసి కార్యాలయ ప్రాంగణంలో ఏజెంట్లు మహా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా నెల్లూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.సతీష్‌బాబు మాట్లాడుతూ పాలసీలపై జిఎస్టీను రద్దుచేయాలని, పాలసీలపై పాలసీదారులకు ఇచ్చే బోనస్‌ను పెంచాలని, ఏజెంట్ల కమిషన్‌ను చెల్లింపులో పాతపద్దతి కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్ఐసి బ్రాంచి ఏజెంట్ల కార్యవర్గ అధ్యక్షుడు ఎస్.నారాయణస్వామి మరియు కార్యదర్శి వై.బాబురావు, ట్రెజరర్ కోనాటి ఈశ్వర్, ఫౌండర్ శ్రీమన్నారాయణ, మరియు బ్రాంచి పరిధిలోని అన్ని మండలాలకు చెందిన ఏజెంట్లు పెద్దసంఖ్యలో హజరయ్యారు. సమస్యలపై పరిష్కారం చూపించని ఎడల దశలవారీగా అన్ని మండలాలకు చెందిన ఏజెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సమస్యల పరిష్కారం చూపించని ఎడల దశలవారీగా పోరాటాన్ని తీవ్రతరం చేస్తామన్నారు.

## తెదేపా సభ్యత్వ నమోదులో ఆదర్శం కావాలి

**- ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం**

**శాంతిపురం, అక్టోబర్ 28 ప్రభాతవార్త**



తెలుగుదేశం అధినేత, సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో పార్టీ సభ్యత్వ నమోదులో కుప్పం నియోజకవర్గం ఆదర్శం కావాలని ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం శాంతిపురం లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష రూపాయలు కట్టేవారికి శాశ్వతసభ్యత్వం, 100రూ.లు చెల్లించే వారికి సభ్యత్వంతో పాటు 5లక్షల భీమాతో పాటు మృతి చెందిన రోజు అంత్యక్రియలకు పదివేలు చెల్లించడం జరుగుతుందన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధతో సభ్యత్వ నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ, ఎల్.జయరాంరెడ్డి, మణి, చంద్ర, ఉయ్యాల జయరాంరెడ్డి, డి.చలపతి, నాగరాజు, రమేష్, దాము, అనసూయ, సుగుణమ్మ పాల్గొన్నారు.

## మాదిగల ఆత్మీయ సదస్సు జయప్రదం చేయాలి

**శాంతిపురం, అక్టోబర్ 28 ప్రభాతవార్త**

తిరుపతిలో నవంబర్ 4న జరిగే మాదిగల ఆత్మీయ సదస్సును జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, కుప్పం ఇన్‌ఛార్జ్ రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు రవీంద్ర మాదిగ కోరారు. సోమవారం రామాపురంలో వారు పర్యటించి మాదిగ కులస్తులను కలసి సదస్సు గురించి వివరించారు. ఈసదస్సు కు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు. మహిళలు, యువత, ఉద్యోగులు, విద్యార్థులు తప్పక హాజరు కావాలని కోరారు. సమావేశంలో నేతలు పాపన్న, వెంకటేష్, గోవిందప్ప, జయప్ప, నారాయణప్ప, రామకృష్ణ, వెంకటేష్, చంద్రబాబు పాల్గొన్నారు.

## తెదేపా శాశ్వత సభ్యత్వం పొందిన మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

**శాంతిపురం, అక్టోబర్ 28 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు శాశ్వత సభ్యత్వం పొందారు. శాశ్వత సభ్యత్వం కోసం లక్ష రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు.

## పరమహంసలో పన్నెండు జిల్లాల ఉపాధ్యాయులకు వర్క్‌షాప్

**శాంతిపురం, అక్టోబర్ 28 ప్రభాతవార్త**



స్థానిక శ్రీ పరమహంస యోగానంద విద్యాలయంలో హబ్ అండ్ స్పోక్ అటల్ టీచర్స్ వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. ఎఎస్‌ఎ ఎపిడి వెంకటరమణారెడ్డి, డ్వామా పిడి రవికుమార్, బిఆర్‌డి ఆస్పత్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, విద్యాలయ ఛైర్మన్ గోపాల్ జి అగర్వాల్, ఎంఇఒలు చంద్రశేఖర్, వెంకటయ్య, ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్, జిల్లా సైన్స్ అధికారి రమణ, అటల్ టింకరింగ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ మెంబర్ షాహినా ప్రవీణ్, ఎపి కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన భువనేశ్వరి, ఎంఎఒ ఇంద్రాణిలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అటల్ ప్రయోగశాల విస్తరణ, ఆవశ్యకత దానితో కలిగే ప్రయోజనాల గురించి వక్తలు వివరించారు. ఉపాధ్యాయులు అక్షత, నారాయణరెడ్డి, పన్నెండు జిల్లాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పైపాళ్యంలో నూతన తాగునీటిబోరు ప్రారంభం

**కుప్పంరూరల్, అక్టోబర్ 28 ప్రభాతవార్త**



మండలంలోని పైపాళ్యం బిసి కాలనీలో తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించారు. ఇటీవల కాలనీలో నీటి సమస్య నెలకొనడంతో మహిళలు ధర్నా చేపట్టారు. దీ ంతో స్పందించిన ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పురుషోత్తం, ఎంపిడిఒ సాయిలహరి కాలనీలో నూతన బోరు డ్రిల్ చేయాలని నిర్ణయించారు. ఆదివారం గ్రామంలో నూతన బోరు డ్రిల్ చేయగా నీరు పుష్కలంగా లభించింది. సోమవారం ఎంపిడిఒ సాయిలహరి మంచినీటి బోరును ప్రారంభించారు. కాలనీ మహిళలు సిఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎఇ మధు, కార్యదర్శి రమ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ వల్లెప్ప పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## బోయకొండ పాలనపై ప్రక్షాళన అవసరం : బిజెపి

**చౌడేపల్లి, అక్టోబర్ 28 ప్రభాతవార్త**



శక్తిక్షేత్రం బోయకొండ పాలనపై ప్రక్షాళన అవసరమని బిజెపి మండలాధ్యక్షుడు కడియాల మనోహర్ రాయల్ అన్నారు. స్థానికంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న బోయకొండపై గాలివీడుకు చెందిన దేశవాను సురేష్‌రెడ్డి అతని స్నేహితులపై పెద్దభోగం విషయంలో దాడిచేయడం అమానుషమన్నారు. దేవస్థానం వారు ఇకపై ఇలాంటి చర్యలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలనీ, దాడి చేసిన వారి టెండరు రద్దు పరచాలని ఆయన కోరారు. కిసాన్‌మోర్చా ఐటి సెల్ జిల్లా కన్వీనర్ గందోడి ప్రవీన్, జనసేన నాయకుడు గందోడి చరణ్ రాయల్, రాఖీ, నరేష్, నీలంరెడ్డి, రెడ్డెప్ప, శేఖర్ తదితరులు హాజరయ్యారు.

## 30న మండల సర్వసభ్య సమావేశం

**చౌడేపల్లి, అక్టోబర్ 28 ప్రభాతవార్త**

మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 30న నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ లీలామాధవి ఒక ప్రకటన లో తెలిపారు. ప్రభుత్వశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పకుండా హాజరు కావాల న్నారు.

## అభివృద్ధిని అడ్డుకోం...స్వాగతిస్తాం...: ఎంపిపి

**కల్లూరు, అక్టోబర్ 28 ప్రభాతవార్త**



అభివృద్ధిని అడ్డుకోమని, స్వాగతిస్తామని ఎంపిపి సురేం ద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం పులిచర్ల ఎంపిడిఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి సురేంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. మండలంలో గత 4నెలలుగా జరుగుతున్న అభివృద్ధిని స్వాగతి స్తామన్నారు. పులిచర్ల మండలంలో 38 సిమెంటు రోడ్డు పనులు మంజూరయ్యాయనీ, వాటికి సంబంధించిన అనుమతులను నేరుగా సర్పంచు వద్ద తీసు కోవచ్చునన్నారు. అధికారులు తమ శాఖల పనితీరును సమావేశంలో వివరించారు. మండల వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులకు వార్డు సభ్యుడి నుంచి ఎంపి వరకు సహకరిస్తామన్నారు. మండల సర్వసభ్య సమావేశంలో ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో భారీ బందుబస్తు ఏర్పాటు చేయడం గమనార్హం. ఎంపిడిఓ రాజశేఖర్‌బాబు, తహశీల్దార్ జయసింహ, పిఆర్ ఎఇఇ రామకృష్ణ నాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇఇ గౌతమి, వ్యవసాయాధికారి శ్రీనివాసులు, ఇజిఎస్ ఎపిఓ సౌకత్తాలి, ఐకెపి ఎపిఎం రమేష్, ఎంపిటీసీలు చంద్ర, ఉషారాణి, గీతాంజలి, సర్పంచులుప్రతాపరెడ్డి, నట్రాజు, వాసుదేవరెడ్డి, మునిరత్నం పాల్గొన్నారు.

## ఉదయనిధి స్టాలిన్‌చే అవార్డు అందుకున్న సెల్వకుమార్

**కుప్పం, అక్టోబర్ 28 ప్రభాతవార్త**



తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత కరుణానిధి శతజయంతి సందర్భంగా తమిళనాడులో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ద్రవిడ విశ్వవిద్యాలయం తమిళశాఖ పరిశోధక విద్యార్థి సెల్వకుమార్ ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈసందర్భంగా తమిళనాడు ఉపముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు ఉదయనిధి స్టాలిన్ చేతుల మీదుగా సెల్వకుమార్ అవార్డును అందుకున్నారు. ఉత్తమ అవార్డు పొందిన సెల్వకుమార్‌ను వర్సిటీ ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

## కేన్సర్‌తో బాధపడుతున్న మహిళకు ఆర్థికసాయం

**కుప్పం, అక్టోబర్ 28 ప్రభాతవార్త**



కుప్పం ఎన్టీఆర్ కాలనీ వినాయ క వీధిలో నిరుపేద కుటుంబానికి చెందిన వేలమ్మాళ్ అనే మహిళ నాలుగు నెలలుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న రాజ్యాధికారం బ్లడ్ డోనర్స్ నవీన్ అతని బృందం వేలమ్మాళ్ ఇంటికి చేరుకుని ఆమెకు తమవంతు ఆర్థికసాయం అందించారు. ప్రభుత్వం తరపున ఆమెకు సిఎంఆర్‌ఎఫ్ మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని కుప్పం తెదేపా విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, యువనేత అప్పు తదితరులు పేర్కొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కార్పొరేట్ వైద్యాన్ని అందించడమే లక్ష్యం

**భాజపా నేత కె.కోటీశ్వరరావు**

**కోట, అక్టోబర్ 28 ప్రభాతవార్త**



కోట సామాజిక వికాస కేంద్రాన్ని అభివృద్ధి చేయ డానికి కూటమి ప్రభుత్వ సహకాంతో ప్రయత్ని స్తామని రాష్ట్ర భారతీయ జనతా పార్టీ మాజీ ఉపాధ్యాక్షులు కుమారి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం కోటలోని మూపై పడకల ఆసుపత్రిని ఆయన మండల భాజపా నాయకులతో కలిసి తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ప్రతి భాగాన్ని ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న వనరులు ఇంకా ఏమైనా అవసరమా అని ఆయన వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ ఆసుపత్రికి కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు లోని కొన్ని గ్రామాలకు ప్రధానంగా ఆరోగ్య కేంద్రంగా ఉందన్నారు. సముద్ర తీర ప్రాంతంలోని ఎస్సీల, ఎస్టీలు బీసీలు మత్స్య కారులు, ఈ ఆరోగ్య కేంద్రంకు ఎక్కువ మంది వస్తుంటారని చెప్పారు. ప్రసూతి ఆపరేషన్లు, పాటు డెంగు, మలేరియా, టైపాయిడ్ ,పామకాటు, అత్యవసర చికిత్సలు ఎక్కువ మంది వచ్చి సేవలు పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ ఆసపత్రిని 50 పడకల స్థాయికి పెంచితే మరింత మందికి కార్పొరేట్ వైద్యం అందించ వచ్చుని ఆయన పేర్కొన్నారు. ఇటవలే తాను ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌తో కూడా కలిసి ఈ ఆసు పత్రిని 50 పడకల స్థాయికి పెంచాలని కోరడం జరిగిందన్నారు. ప్రజలకు వైద్యులు బాగా సేవలు అందిస్తున్నారని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటీశ్వరరావు, మండల శాఖ అధ్యక్షులు సారంగం రమేష్ బాబు, అంబరీష్, వెంటేశ్వర్లు ఉన్నారు.

## తెదేపాలో కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు

**కోట, అక్టోబర్ 28 ప్రభాతవార్త**



దేశంలో ఏ రాజకీయ పార్టీలోలేని విధంగా తెదేపాలో క్రియాశీలక కార్యకర్తలకు ఎల్లప్పుడు గుర్తింపు ఉం టుందని తెదేపా నాయకులు చిల్లకూరు ధశరాథ రామిరెడ్డి అన్నారు. సోమవారం కోట మండలం దోరు వుకట్ట గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన, తో పాటు తెదేపా సినియర్ నాయకులు నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదులో భాగస్వామ్యం కావాలని సూచిం చారు. గ్రామాల్లో సభ్యత్వ నమోదు పై అవగాహన కల్పించాలన్నారు. నూతన విధానంలో రూ 100 చెల్లించి సభ్యత్వం తీసుకంటే రెండేళ్లపాటు రూ 5లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని వివరించారు .సభ్యత్వం తీసుకోవడం ద్వారా పార్టీకి మీకు బలం చేకూరుతుందని వివరించారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందడుగు వేస్తుందని చెప్పారు. గూడూరు శాసన సభ్యులు డాక్టర్, పాశిం సునీల్ కుమార్ నాయకత్వంలో నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. మాజీ తెదేపా అధ్యక్షులు, పాదర్తికోటీశ్వరరెడ్డి, పాల్గొన్నారు.

## పశువుల మేత భూమిని ఆక్రమించారని

**తహశీల్దార్‌కు ఫిర్యాదు**

**బాలాయపల్లి, అక్టోబర్ 28, ప్రభాతవార్త**



సిద్ధాగుంట గ్రామంలో పశువుల మేత పోరంబోకు చెందిన 40 ఎకరాలు పొలాన్ని కొంత మంది ఇతర మండలాల వారు తుపాటి చెంచయ్య మరి కొంత మంది ఆక్రమించుకుంటున్నారని తహశీల్దార్ శ్రీనివాసులుకు సర్పంచ్ కె. రత్నమ్మ, రాఘవరెడ్డి, మరి కొంత మంది గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. జేసిబి యంత్రాలతో పొలాన్ని చదును చేస్తున్నారని ఫిర్యాదు చేసిన సర్పంచ్ కె. రత్నమ్మ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో సర్పంచ్ కె. రత్నమ్మ, కొంత మంది గ్రామస్తులు పేర్కొన్నారు.

## బాలాయపల్లిలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు: డిఎల్‌పిఓ

**బాలాయపల్లి, అక్టోబర్ 28, ప్రభాతవార్త** మండల కేంద్రమైన బాలాయపల్లి పంచాయితీ స్థలం ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని గూడూరు డిఎల్పిఓ వెంకటరమణ తెలిపారు. సోమవారం ఆయన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించే స్థలాన్ని ఆయన పరిశీలించారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు కొందరు దాతలు ముందుకు వచ్చారని తెలిపారు. ఆయన వెంట ఈవోపిఆర్డి మోహన్ రాజు పంచాయితీ కార్యదర్శి లీలావతి, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, టిడిపి నేత సత్యం నాయుడు తదితరులు ఉన్నారు.

## మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకుల రిలే దీక్షలు

**వెంకటగిరి, అక్టోబర్ 28, ప్రభాతవార్త**



తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని మధ్యా హ్నం పథకం భోజన నిర్వాహకులు ఎంఈఓ కార్యాల యం వద్ద రిలే నిరాహార దీక్షలు చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలంటే పెరిగిన ధరలకు అనుకూలంగా మాకు వేతనాలు పెంచాలని కోరారు. మధ్యాహ్నం భోజనం పథకం నిర్వాహకులపై ప్రభుత్వ వేధింపులు ఎక్కువయ్యాయని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చంగయ్య విమర్శించారు. మధ్యాహ్న పథకం భోజన నిర్వాహకుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. దీక్షలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు పాల్గొన్నారు.

## తొలి దశ యాజమాన్యంతోనే అధిక దిగుబడులు

**జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం శిక్షణ కోఆర్డినేటర్ భాస్కరయ్య**

**బాలాయపల్లి, అక్టోబర్ 28, ప్రభాతవార్త**



వరి పైరు నాటిన 45 రోజులు వరకు మంచి యాజమాన్యం పాటిస్తేనే అధిక దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య తెలిపారు. బాలాయపల్లి మండలం, పిగిలాం గ్రామంలో రైతు శిక్షణలో ఆయన మాట్లాడారు. మొక్కలు బలంగా ఎదగడానికి అవసరమైన కాంప్లెక్స్, పొటాస్ ఎరువులను దుక్కిలోనే వేయాలని సూచించారు. నాట్లు పై పేనే వేయాలని తెలిపారు. నాటిన తర్వాత చిరుపొట్ట దశ వరకు పొలంలో పలుచగా నీరు పెట్టాలని, దీనివలన పిలకలు అధికంగా వస్తాయని చెప్పారు. పిలకలు పెట్టే దశలో 35 - 40 కిలోల యూరియా వేస్తే, చీడలు అదుపులో ఉంటాయని చెప్పారు. పంటకు అధికంగా యూరియా వాడకం వలన చీడల బెడద ఎక్కువై దిగుబడును తగ్గుతాయన్నారు. వరిలో కలుపు, చీడల నివారణ గురించి ఏఓ వేణుగోపాల్ రావు వివరించారు. నిమ్మలో కత్తిరింపులు, పూత నియంత్రణ, చీడల నివారణ గురించి ఉద్యాన అధికారి ఆనంద రెడ్డి వివరించారు. పండ్లు, కూరగాయలు, పూల సాగుకు ఉద్యాన శాఖ అందిస్తున్న పథకాల గురించి ఆయన రైతులకు తెలిపారు. కార్యక్రమంలో రైతులతో పాటు మండల వ్యవసాయ అధికారి శిరీష, గ్రామ వ్యవసాయ సహాయకులు గోపాల్, వినోద్ కుమార్, పెంచలయ్య, సలీం పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

**కమాండెంట్ అరుణ్ బోస్**

**వెంకటగిరి, అక్టోబర్ 28, ప్రభాతవార్త**



రక్తదానం ప్రాణదానంతో సమానం అని తొమ్మిదవ పోలీస్ బెటాలియన్ ఇన్చార్జి కమాండెంట్ ఎం. అరుణ్ బోస్ తెలిపారు. వెంకటగిరి 9వ బెటాలియన్‌లో పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవ వారోత్స వాల్లో భాగంగా మెగా మెడికల్ క్యాంపు నిర్వహిం చారు. సమాజంలో ఉన్న వారికి రక్తదానం చేస్తే వారిని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చునని తెలిపారు. ముఖ్యంగా యువత రక్తదానం చేయాలని సూచించారు. మెగా మెడికల్ క్యాంపును రమాదేవి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్, ఫిరోజ్ డెంటల్ హాస్పిటల్ తిరుపతికి చెందిన వారు నిర్వహించారు. తిరుపతి జిల్లా బ్లడ్ సెల్ వారి ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ కోటిరెడ్డి, రామకృష్ణ, యూనిట్ హాస్పిటల్ డాక్టర్స్ శేషమ్మ, ప్రవీణ్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, బెటాలియన్ చుట్టు పక్కల ఉన్న పల్లెల్లోని ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరుపతి జిల్లా బ్లడ్ సెల్ నోడల్ ఆఫీసర్‌ని సందీప్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 36 మంది సిబ్బంది రక్తదానం చేశారు. అనంతరం వారికి బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్స్ అందజేశారు.

## భూ సమస్యలే అధికంగా వస్తున్నాయి

**వాకాడు, అక్టోబర్ 28, ప్రభాతవార్త**



మండలంలోని అధిక భాగం భూ సమస్యలే వస్తున్నా యని మండల తహశీల్దార్ రామయ్య తెలిపారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయాన్ని తహశీల్దార్ రామయ్య ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ తెలియజేస్తూ మండలంలోని వల్లమేడు, వాకాడు, తిరుమూరు గ్రామంలో భూ సమస్యలుతో పాటు ఇంటి స్థలాల కొరకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సందీప్ కుమార్, ఆర్ఐ అఖిల్ యాదవ్, వీఆర్‌ఓలు ఉన్నారు.

## సంఘమిత్ర కార్యాలయంలో నిధులు దుర్వినియోగం వాస్తవమే

**అదనపు డైరెక్టర్ రాజప్రతాప్**

**బాలాయపల్లి, అక్టోబర్ 28, ప్రభాతవార్త**



సంఘమిత్ర కార్యాలయంలో నిధులు దుర్వినియోగం పై ఆ పథకం డైరెక్టర్ రాజప్రతాఫ్ విచారణ జరిపారు. బాలాయపల్లి సంఘమిత్ర కార్యాలయంలో రూ. 28 లక్షల రూపాయల నిధులు దుర్వినియోగం అయినట్లు మన్నూరు గ్రామానికి చెందిన చెన్నూరు మస్తాన్ సిఈవోకు ఫిర్యాదు చేశారు. సిఈఓ ఆదేశాల మేరకు అడిషనల్ డైరెక్టర్ రాజా ప్రతాప్ కార్యాలయానికి వచ్చి ఏపిఎం జమున రాణి, సిసిలు సురేఖ, విఓఏలు సిబ్బందిని విచారించారు. బాలాయపల్లి, మన్నూరు, అలిమిలి ఇంకా పలు పంచాయితీలో జరిగిన నిధుల అవకతవకలపై విచారించారు. నిధులు దుర్వినియోగం, మళ్లింపు వాస్తవమేనని ఆయన అన్నారు. రికార్డులు సక్రమంగా లేవని ఆయన తెలిపారు. నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు సిఈవో, అందజేస్తామని తెలిపారు. అనంతరం నిధులు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంపి కేశినేని చిన్నాని కలిసిన

**జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు**

**గూడూరు, అక్టోబర్ 28, ప్రభాతవార్త**



ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎంపి కేశినేని చిన్నా, కార్యదర్శి సానా సతీష్‌లను ఉమ్మడి నెల్లూరు జిల్లాలో క్రికెట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కొణిదల మునిగిరీష్, మాజీ కార్యదర్శి డి. శ్రీనివా సులు రెడ్డిలు సోమవారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఉమ్మడి నెల్లూరు జిల్లా క్రికెట్ క్రీడాభివృద్ధికి చేపట్టవలసిన పలు అంశాలపై రాష్ట్ర అసోసియేషన్ పెద్దలతో చర్చించారు. డివిజన్ కేంద్రమైన గూడూరులోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో పెద్ద సంఖ్యలో క్రికెట్ క్రీడపై ఆసక్తి కలిగిన విద్యార్థినులు విద్యను అభ్యసిస్తుంటారని తెలిపారు. ఈ ప్రాంతంలో మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు మహిళా క్రికెట్ ఉప శిక్షణ కేంద్రంను ఏర్పాటు చేయించాలని మునిగిరీష్ కేశినేనికి విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఆంధ్రా అసోసియేషన్ పెద్దలు గూడూరులో మహిళా క్రికెట్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు మునిగిరీష్ పేర్కొన్నారు.

## మధ్యాహ్నం భోజనం కార్మికులకు మెనూ చార్జీలు పెంచాలి

**ఎంఈఓకి వినతి**

**ఓజిలి, అక్టోబర్ 28, ప్రభాతవార్త**



మధ్యాహ్నం భోజనం కార్మికులకు మెనూ చార్జీలు పెంచాలని మధ్యాహ్నం భోజన కార్మికులు సోమవారం ఎంఈఓకి వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి శివకవి ముకుంద మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్నం భోజన కార్మికులు నిరసన కార్యక్రమంలో భాగంగా నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు పెట్టి చాకిరి చేస్తున్నారని వారు డిమాండ్ చేశారు. మెనూ చార్జీలు ఒక విద్యార్థికి 20 రూపాయిలు ఇవ్వాలని, 9,10 తరగతిలకు భోజనం వండి పెట్టినందుకు వారికి వేతనాలు ఇవ్వాలని గ్యాస్ ప్రభుత్వం సరఫరా చేయాలని గుర్తింపు కార్డులు ఇవ్వాలని రాజకీయ వేధింపులు అరికట్టాలని పథకం అమలకు కనీస మౌలిక వంట ప్లేట్లు మంచినీరు గ్లౌజులు, మాస్కులు, యాప్రాన్ సదుపాయాలు కల్పించాలని ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదు. స్కూల్‌లో భీమా సౌకర్యం కల్పించాలి వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం 20 లక్షలు రూపాయిలు ఇవ్వాలని దహన సంస్కరాలకు మట్టి ఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేసారు. సెలవులు ఇవ్వాలని సంవత్సరానికి రెండు జతలు యూనిఫాం ఏర్పాటు చేయాలన్నారు. ఎంఈవోలు రెండు నెలలకు ఒక సారి సమావేశాలు ఏర్పాటు చేసి వారికి జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. వంటశాల ఏర్పాటు చేయాలి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులచే దేశం సభ్యత్వ నమోదు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలో తెలుగుదేశం సభ్యత్వ నమోదుకార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. పట్టణంలో మొదటి సారి శాశ్వత సభ్యత్వంను జిల్లా రైతు సంఘానికి చెందిన తకిళ్ళ ప్రకాష్‌నాయుడు మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు ద్వారా తీసుకున్నారు.ఇదే మొదటి సభ్యత్వం.శాశ్వత సభ్యత్వానికి రూ.లక్ష చొప్పున చెల్లించారు.కాగా మాజీ పట్టణ అధ్యక్షుడు ఆర్యవైశ్య కులానాకి చెందిన వాకచర్ల గుర్రప్పశెట్టి సారధ్యంలో సోమవారం విస్తృతంగా సభ్యత్వ నమోదు చేపట్టారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమ్మవారు వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినాన్ని అధికారికం చేసారని వివరిస్తూ ఆర్యవైశ్యులపై తెలుగుదేశం పార్టీ ఉన్న గౌరవానికి నిదర్శనం అన్నారు. గతంలో కూడా ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆర్యవైశ్యులకు ఎనలేని ప్రాధాన్యత ఇచ్చారన్నారు.నేడు ఆయన తనయుడు సుధీర్‌రెడ్డి కూడా ఆర్యవైశ్యులను గుర్తిస్తున్నారని గుర్రప్పశెట్టి ఇంటింటికి వెళ్ళి వివరిస్తూ సభ్యత్వ నమోదును చేపట్టారన్నారు.కాగా నేడు రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకున్న వారికి బీమా భరోసాను వివరిస్తున్నారు. 12 వార్డులో ఆయనతో పాటు డిల్లిబాబు, వివేక్ గౌడ్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ప్రభుత్వం ఎన్నో వెసులుబాట్లు కల్పిస్తుంది: బొల్లినేని జగన్నాధం నాయుడు



శ్రీకాళహస్తి రూరల్,అక్టోబర్ 28 ప్రభాతవార్త

క్రీడలను క్రీడాకారులను ప్రోత్సహించుటకు ప్రభుత్వం ఎన్నో వెసులుబాట్లు కల్పిస్తుందని వాటిని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బొల్లినేని జగన్నాధం నాయుడు అన్నారు.పంగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. త్వరలో అన్నమయ్య జిల్లాలో రాష్ట్ర స్థాయి ఖోఖో క్రీడల పోటీలకు సంబంధించిన ఎంపిక జరగనుంది. ఈ పోటీలకు పంగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు ఎంపికకు వెళ్ళ నున్నారు.పోటీలకు హాజరుకానున్న విద్యార్థులకు జగన్నాధం నాయుడు యూనిఫారాలను అందించారు.ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రతిభావంతులైన క్రీడాకారులున్నారని కానీ గత ఐదేళ్ళలో వారిని గుర్తించలేదన్నారు. యువనాయకుడు బొజ్జల సుధీర్‌రెడ్డి మండలానికి ఒక మినీస్టేడియంను సాధించుటకు శాప్ ద్వారాప్రయత్నిస్తున్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో క్రీడలకు మంచి ప్రాధాన్యత ఉంటుందన్నారు. చదువులతో పాటు క్రీడల్లో ఆసక్తి చూపిన వారికి ఎంతో భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడలుమంచి ఆలోచనలతోపాటు దేహధారుడ్యాన్ని అందిస్తుందని జగన్నాధం నాయుడు అన్నారు.ఈ కార్యక్రమాల్లో రాఘవేంద్రరావు, పంగూరు గ్రామ కమిటి నాయకుడు శేషమ నాయుడు, కృష్ణయ్య యాదవ్,విద్యాకమిటికిచెందినరంగయ్య,ప్రధానోపాధ్యాయులు,వ్యాయామ టీచర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## లోబావిలో యువకుడు మృతి



శ్రీకాళహస్తి,అక్టోబర్ 28ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలోని గోపాలవనంలో నివాసముంటున్న కోఠారి రాజేష్ వాకింగ్‌కు వెళ్ళి హఠాన్మరణానికి గురయ్యారు.సోమవారం ఉదయం యథాప్రకారం లోబావికి వాకింగ్‌కు వెళ్ళారు. అక్కడ వాకింగ్ చేస్తూ విశ్రాంతి తీసుకుంటూ ఎసెల్ ఫోన్‌లో ఎవ్వరితోనూ మాట్లాడుతూ కుప్ప కూలి పోయినట్లు సమాచారం వెంటనే గమనించి అంబులెన్స్‌కు సమాచారం అందించారు.రాజేష్‌ను వెంటనే బజారు వీధిలోని ఓ ప్రవైటు వైద్యశాలకు తీసుకొచ్చారు. ఆతను చూసి వేరే ఆసుపత్రికి తరలించారు.ఎంజిఎం కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడకు తీసుకెళ్ళె సమయానికే మృతి చెందినట్లు ధృవీకరించారు.ఆతని మృతికి పట్టణానికి చెందిన పలువురు సంతాపం తెలిపారు.ఆయన మృతికి సంతాపంగా షెటీలు పలువురు తమ దుకాణాలను మూసి సంతాపం తెలిపారు.

## ఒలిపింయాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల సత్తా

.తొట్టంబేడు, అక్టోబర్ 28 ప్రభాతవార్త



తొట్టంబేడు పరిధిలో ఉన్న శ్రీచైతన్య టెక్నో పాఠశాల' 3 బ్రాంచిలో చదువుతున్న విద్యార్థులు కెపిటి ఒలిపింయాడ్‌లో తమ సత్తా చూపినట్లు ప్రిన్సిపల్ నిరోషా, డీన్ సురేంద్రలు తెలిపారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ నిరోషా మాట్లాడుతూ ఇటీవల జరిగిన క్యాట్ పరీక్షలో 55మంది చిన్నారులు రెండోస్థాయికి ఎంపికవ్వడం ఎంతో సంతోషమన్నారు. తమ పాఠశాలలో విలువలతో కూడిన విద్యతో పాటు పోటీ పరీక్షలకు ఎలా తయారవ్వాలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని అంతేకాకుండా క్రీడల్లోను, అన్ని రంగాల్లోను తమ సత్తా చాటేలా శిక్షణ ఇస్తున్నామన్నారు. తల్లిదండ్రులు కూడా చిన్నారులను ప్రోత్సహించాలన్నారు. రెండోస్థాయిలో కూడా విజయం తప్పక సాధిస్తారని ప్రిన్సిపల్ నిరోషా తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందజలో ఉండాలి..సిఐ

తొట్టంబేడు, అక్టోబర్ 28 ప్రభాతవార్త



ఏపి రాష్ట్ర స్థాయి 10వ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న మహిళా క్రీడాకారులు వచ్చేనెల 8 నుంచి మూడు రోజుల పాటు నంద్యాలలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనంటున్నారు. వీరికి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అధ్యక్షుడు సి.వెంకటస్వామి మహిళా డిగ్రీ కళాశాలలో రాష్ట్ర స్థాయి క్రీడాకారులకు శిక్షణ నిర్వహించారు. ముఖ్యఅతిధిగా టుటౌన్ సిఐ వెంకటశులు విచ్చేసి క్రీడాకారులను అభినందించారు. ప్రస్తుత సమాజంలో మహిళలు నేటి కంప్యూటర్ యుగంలో ముందంజలో ఉండాలని క్రీడలు వల్ల ఉపయోగాలు క్రీడల వల్ల ఉద్యోగ అవకాశాలు మరెన్నో ఉపయోగకరమైన విషయాలను మహిళా క్రీడాకారులకు వివరించారు. ఉద్యోగాల ఇంటర్వ్యూల్లో కూడా క్రీడాకారులకు ప్రత్యేక స్థానం కల్పిస్తారన్నారు. ప్రతి మహిళా తనలో ఉన్న సత్తాను చాటాలని కోరారు. కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల పిడి నరసింహారావు, బాల్‌బ్యాడ్మింటన్ సభ్యులు చంద్ర, సుధాకర్, పిడి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులను సకాలంలో పరిష్కరించండి..డిఎస్పీ

తొట్టంబేడు, అక్టోబర్ 28 ప్రభాతవార్త



పెండింగ్ కేసులను సకాలంలో పరిష్కరించాలని డిఎస్‌పి కె.నరసింహామూర్తి తెలిపారు. సోమవారం వార్షిక తనిఖీల్లో భాగంగా టుటౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి కేసుల యొక్క పురోగతిని పరిశీలించి కేసులకు సంబందించి సిఐ వెంకటేశులకు పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. కేసులను సత్వరం పరిష్కరించుకోవాలంటే లోక్‌అదాలత్ ఉందని కక్షిదారులకు ఈవిషయాలను తెలియజేసినట్లయితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని వారే రాజీపడి కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని పరిష్కరించాలరో తెలుసుకున్నారు. అదేవిధంగా స్టేషన్‌కు వచ్చే పిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని వారి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూడాలని, వృత్తిలో నిబద్ధత కలిగి ఉండాలని సూచించి కొత్త చట్టాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ముఖ్యంగా పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి గంజాయిని నివారించేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్ళాలని సిఐకు తెలిపారు. సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం సేవిస్తే వారిని వెంటనే అదుపులోకి తీసుకోవాలన్నారు.అనంతరం టుటౌన్ పోలీస్‌స్టేషన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసి ఇంకా బాగా పనిచేయాలని సిఐకు సూచించారు.

## టపాకాయల దుకాణాల నిర్వాహకులతో ఆర్డీవో సమీక్ష

శ్రీకాళహస్తి, అక్టోబర్ 28 ప్రభాతవార్త



దీపావళి పండుగను పురస్కరించుకుని శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిరోడ్డులో ఏర్పాటు చేసిన దుకాణాల ఏర్పాటు చేశారు. దుకాణాలపై తీసు కోవాల్సి న జాగ్రత్తల గురించి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి పలుసూచనలు సలహాలు దుకాణాల నిర్వాహకులకు సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు ప్రతి ఒక్కరు నిబంధనల మేరకు ఏర్పాటు చేసుకోవాలని ప్రతి దుకాణం వద్ద ప్రమాదం ఏర్పడినపుడు వాటిని నివారించడానికి కావాల్సి న సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మొత్తం 13దుకాణాలకు అనుమతిచ్చామన్నారు. వీటిని అధికారులు ప్రతిరోజు టపాకాయల దుకాణాలను పర్యవేక్షణ చేస్తూ తగిన సలహాలు సూచనలు ఇవ్వాల్సిందిగా కోరా రు. ఎవ్వరికి ఇబ్బందులు లేకుండా దీపావళి పండుగను జరుపుకోవాలన్నారు. ముఖ్యంగా చిన్నారులు టపాకాయలు కాల్చేటపుడు తల్లిదండ్రులు గమనించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆర్డీవోతో పాటు మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, అగ్నిమాపకశాఖాధికారి నాగేశ్వరరెడ్డి, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 211 అర్జీలు

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 28, ప్రభాతవార్త



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చి అర్జీలను నిర్దేశించిన సమయంలోపు పరిష్కారం చూపాలని అలసత్వం వహించరాదని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అధికారులను సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్‌ఓ పెంచలకిషోర్, డిప్యూటీ కలెక్టర్ దేవేంద్ర రెడ్డి, డిపిఓ సుశీల దేవి, డిఆర్‌డిఏ పిడి శోభన బాబు, డ్వామా పిడి శ్రీనివాసులతో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు నుండి వినతులు స్వీకరించారు. మొత్తం 211 వినతులు రావడం జరిగిందని అధికారులు అందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా నాణ్యతగా, అర్థవంతంగా పరిష్కరించాలని గ్రీవెన్స్‌కు హాజరైన వివిధ శాఖలకు సంబంధించిన అధికారులకు జేసి సూచించారు.

## విద్యార్థులకు ప్రాథమిక హక్కులపై అవగాహన అవసరం

తిరుపతి విద్య, అక్టోబర్ 28,ప్రభాతవార్త:



విద్యార్థులకు ప్రాథమిక హక్కులపై అవగాహన అవసరమని మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ సాయి సుజాత పేర్కొన్నారు.శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో తుమ్మలగుంట ప్రాథమిక పాఠశాలలో లీగల్ రైట్స్ పై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ముఖ్య అతిథులుగా హాజరైన ఆచార్య డి.సాయి సుజాత మాట్లాడుతూ ప్రాథమిక హక్కులు,వాటి ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు.న్యాయ విభాగపు అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ ఎన్.విక్టోరియా మాట్లాడుతూ ప్రాథమిక విధులు విద్యా,హక్కు చట్టం గురించి విద్యార్థులకు వివరించారు.సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ అకాడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ పి.సునీత మాట్లాడుతూ బాలికల యొక్క విద్య ఆవశ్యకత గురించి వివరించారు.ప్రాథమిక హక్కులు,ప్రాథమిక విధులు వాటి గురించి విద్యార్థులకు అవగాహన అవసరం అన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పి.భారతి,బోధన,బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాటు సారా, బెల్లం స్వాధీనం

విజయపురం, అక్టోబరు 28 ప్రభాతవార్త:




మండలంలోని కేవీ పురంలో సోమవారం నాటు సారా బెల్లం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ బలరాం తెలిపారు. నాటుసారా స్థావరాలపై దాడుల్లో భాగంగా నాటుసారా బెల్లం 137 మూటలు, 600 లీటర్ల సారా ఊట, ఆరు బ్యారెల్, 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా తయారీపై ఉక్కుపాదం మోపుతున్నట్టు తెలిపారు. నాటుసారా తయారీని ప్రోత్సహించినా, తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నాయకుడు మృతికి నాయకుల నివాళి

విజయపురం, అక్టోబరు 28 ప్రభాతవార్త:



మండలంలోని మహారాజపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు రామచంద్రరాజు మృతదేహానికి చిత్తూరు పార్లమెంట్ అధికారప్రతినిధి చినబాబు సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. చిత్తూరు పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు సుధాకర్‌రాజు, కొండూరు దాము, సుబ్రహ్మణ్యంరాజు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

## భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోకపోతే ప్రతి స్థలం కబ్జామయం

### రిటైర్డ్ పోలీస్ అధికారే కబ్జాకు పాల్పడితే సామాన్యుడి పరిస్థితి ఏంటి బాధితులు ఆవేదన

తిరుపతి హెల్త్, అక్టోబర్ 28, ప్రభాతవార్త



తిరుచానూరు హైవే అర్బన్ హాట్ ఎదురుగా ఉన్న పిఎస్ 4 ప్రక్కన ఉన్న తమ 72 సెంట్లు భూమిలో 21 సెంటును డిఎస్పి భాస్కర్ నాయుడు వారి అనుచర గణం 2012లో నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాకు పాల్పడ్డారని, దీనిపై తాము చట్ట, న్యాయపరంగా పోరాడుతున్నామని అయినా తమకు న్యాయం జరగలేదని పోరాడుతున్నామని అయినా తమకు న్యాయం జరగలేదని, ఈ మధ్య కబ్జా జరిగిన స్థలంలో వైన్ షాప్ ఏర్పాటు చేశారని తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బాధితులు చిత్తూరు జిల్లా నగరి, ఏకాంబరకుప్పంకు చెందిన ఎన్.పి జీనానందన్ వారి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన తండ్రి 1986లో తిరుపతి, తిరుచానూరు లెక్క దాకాలా సర్వే నెంబర్ 255/1 బి 1 పూరా విస్తీర్ణం తమ 72 సెంట్లు భూమి తరతరాలుగా మా పూర్వీకులు మా తండ్రి ఎన్‌జి పాండురంగన్ నుంచి తమకు సంక్రమించిందని గత నాలుగు దశాబ్దాలకు సంబంధించిన భూమి పత్రాలను మీడియా ముందు చూపించారు. కెవిబి పురం మండలంకు చెందిన డిఎస్‌పి భాస్కర్ నాయుడు తిరుపతిలో విధులు నిర్వహించి చివరిగా కెవిబి పురం లోనే రిటైర్డ్ అయ్యారని తెలియజేసారు. ఈ భాస్కర్ నాయుడుకి తమ భూమి చుట్టు ఉన్న 48 ఎకరాలకు సంబంధించిన ఎంఆర్‌ఓ అడంగల్ నందు ఒక సెంటు స్థలం కూడా లేదని ఇతనికి సంబంధంలేని స్థలాన్ని దురాశతో దోచుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన భూమిపై ఎలాంటి వివాదం లేదని, తమ భూమి పక్కనున్న ప్రభుత్వ భూమిలో రాజకీయ గొడవలు ఉన్నాయన్నారు. తమది రిజిస్టర్ కాబడిన ప్రైవేటు ల్యాండ్ అని గత చరిత్రను తెలియజేశారు. దీనిపై ప్రభుత్వ అధికారులు విచారణ జరిపి పూర్తి వివరాలను తెలుసుకుని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

## ఆఫీసర్స్ సోసియల్ అండ్ కల్చరల్ క్లబ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె. మోహన ముని సిద్దారెడ్డి



తిరుపతి హెల్త్, అక్టోబర్ 28, ప్రభాతవార్త

ఆఫీసర్స్ సోసియల్ అండ్ కల్చరల్ క్లబ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె. మోహన ముని సిద్ధారెడ్డిని ఎన్నుకున్నారు. ఆఫీసర్స్ సోసియల్ అండ్ కల్చరర్ క్లబ్ సర్వ సభ్య సమావేశం నిర్వహించి, పోలీస్ భద్రతలో రిటర్నింగ్ అధికారి ప్రొఫెసర్ జి. రామచంద్రయ్య ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె. మోహన ముని సిద్దారెడ్డి, సెక్రటరీగా డా. ఎన్. ఆదికృష్ణయ్య, ట్రెజరర్‌గా ఎస్‌విఎస్ ప్రసాద్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా పి. భాస్కరుడు, వి. రవి, జాయింట్ సెక్రటరీస్ బొందు రామచంద్ర రెడ్డి, జీవీ మునికృష్ణయ్య, ఇంటర్నల్ ఆడిటర్ వి. కరంచంద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్. బాబు రావు, ఆర్‌వి దుర్గాప్రసాద్, జె. లక్ష్మీనారాయణ, వి. రమేష్ బాబు, కెఆర్ సుభాష్, సిఎస్ సుకుమార్ రెడ్డిలు ఎన్నికైయ్యారు.

## మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసిన ఎమ్మెల్యే పులివర్తి

తిరుపతిరూరల్, అక్టోబర్ 28 ప్రభాతవార్త:



తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యాటన నిమిత్తం జిల్లాకు విచ్చేన రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. ఒకర్ని ఒకరు అప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, టిడిపి నాయకులు అలిమినేని మధు, చెర్లోపల్లి శ్రీధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బిసిఎం పాఠశాల క్రీడా ఆణిముత్యాలను అభినందించిన జేసి

తిరుపతి క్రీడ, అక్టోబర్ 28, ప్రభాతవార్త



విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుని రాణించాలని తెలుపుతూ బిసిఎం పాఠశాల క్రీడా ఆణిముత్యాలను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అభినందించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో స్థానిక బాలచంద్ర మెమోరియల్ హైస్కూల్ క్రీడాకారులు మర్యాదపూర్వకంగా తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ని కలిశారు. జంప్ రోప్ పోటీల్లో అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఇలాగే క్రీడల్లో ముందుకు సాగాలని అభినందించారు. ఇలాగే క్రీడల్లో ముందుకు సాగాలని మరెన్నో విజయాలను సాధించి తల్లిదండ్రులకు పాఠశాలకు, జిల్లా, రాష్ట్రం, దేశానికి మంచి గౌరవాన్ని ప్రతిష్టతను తేవాలని ఆయన ఆకాంక్షించారు. అంతే కాకుండా విద్యార్థులను ప్రోత్సహిస్తూ మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిల వరకు ప్రోత్సహించిన కరస్పాండెంట్ ప్రియాను , వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీనను తిరుపతి జెసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, ఎన్డీసి దేవేంద్ర రెడ్డి, పిడి డిఆర్‌డిఎ శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు

.తొట్టంబేడు, అక్టోబర్ 28 ప్రభాతవార్త

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలను నిర్వహిస్తున్నామని వీటిని గ్రామరెవెన్యూలో ఉన్న ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ యు.మధుసూధనరావు, డిఐ రాఘవయ్య, సర్వేయర్ కె.హరనాధ్‌లు పిలుపునిచ్చారు. గ్రామసభల్లో భాగంగా రీ సర్వేలో ప్రజల నుంచి పలు వినతులు వచ్చాయి. వాటిని వెంటనే పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలుతీసుకుంటుందని తహశీల్దార్ తెలిపారు. భూయాజమాన్య హక్కులు అన్నదాతలకు వారి భూములు ఎక్కడ వరకు ఉన్నాయో సమగ్రంగా తెలుసుకోవడానికే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చిన వినతులు సకాలంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ రాఘవులు,గ్రామ సర్వేయర్లు, మరియు విజయ్‌లోకేష్, సుకన్య, అంజలి సత్యనారాయణ, కమ్యూనిటీ సర్వేయర్‌లు సత్యనారాయణ, సిద్దిగుంట రైతులు మరియు గ్రామ ప్రజలు హజరయ్యారు.

# తిరుపతి డివిజన్

## నగరిలో రక్తదాన శిబిరం

నగరి, అక్టోబరు 28 ప్రభాతవార్త:



నగరి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సోమవారం నగరి సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు, యువకులు 120 మంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ జరీనా మాట్లాడుతూ కార్వేటినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హనుమంతప్ప, సబ్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, పీసీ తంగవేలు, నింద్ర సీఐ భాస్కర్, సిబ్బంది, విజయపురం ఏలుమలై, వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, ఎస్ఆర్ పురం ఎస్ఐ సుమన్, నగరి హెడ్ కానిస్టేబుల్ ఇంద్రకుమార్, పోలీసు కానిస్టేబుల్ ప్రవీణ్, గోపి, సురేష్, కోటి, గజేంద్ర, తదుపరి జూనియర్ ఎన్‌టీఆర్ ఫ్యాన్స్ యువకులు, జనసేన యువకులు, టీడీపీ యువకులు, కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు. ఈ శిబిరంలో ఎం.ఎస్.కార్తికేయన్, టి.స్పందన, పెథాలజిస్టు, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎం.రాజారత్నమ్మ, ఆస్పత్రి సిబ్బంది, పుత్తూరు హెచ్‌డీబీ బ్యాంకుపాల్గొన్నారు.రక్తదానంచేసిన 120 మందికి జూస్, ఆపిల్, అరటి, పండ్లు, బిస్కెట్లు అందించారు.

## పోలీసు సబ్ డివిజన్ కార్యాలయంలో ఆయుధ పూజ

రేణిగుంట, అక్టోబరు 28 ప్రభాతవార్త:



రేణిగుంట పోలీసు సబ్ డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఘనంగా ఆయుధ పూజను నిర్వహించారు. కార్యక్రమంలో రేణిగుంట అర్బన్ సీఐ శరత్‌చంద్ర, రూరల్ సీఐ మురళీకృష్ణ, ఏర్పేడు సీఐ జయచంద్ర, అర్బన్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి, గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్, డీఎస్పీ ఆఫీస్ క్లర్క్ ధనంజయలు, సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సత్యవేడులో జిల్లా స్థాయి ఆటల పోటీలు

సత్యవేడు, అక్టోబరు 28 ప్రభాతవార్త:



సత్యవేడు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం జిల్లా స్థాయి రబీ ఆటల పోటీలు ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ సత్యవేడు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు పాల్గొని ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ఆణిముత్యాలను వెలికి తీసి వారిలో క్రీడా ప్రావీణ్యం పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల(బాలుర)లో సోమవారం ఎస్‌జీఎఫ్ గేమ్స్ 2024లో భాగంగా జిల్లా స్థాయిలో జరిగే ఆటల పోటీల కార్యక్రమంలో సభనుద్దేశించి శ్రీపతిబాబు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జరిగే ఆటల పోటీ మన సత్యవేడు నియోజకవర్గంలో జరగడం అదృష్టంగా భావిస్తూ విద్యార్థులు ఎటువంటి మనస్పర్థలు లేకుండా ఆటలో పాల్గొని రాష్ట్ర స్థాయికి మన పాఠశాల నుంచి విద్యార్థులు ఎన్నికావాలని పేర్కొన్నారు. గతంలో జరిగిన రెండు నెలలుగా జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో మన పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయికి ఎన్నికైన విద్యార్థులకు రూ.5116లు మండల ఇన్‌చార్జి శ్రీపతిబాబు, మండల కో-ఆర్డినేటర్ ప్రవీణ్‌రెడ్డి అందించడం జరిగింది. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారి వివరాలు అండర్-14 బాయ్స్ అథ్లెట్ లాంగ్ జంప్‌లో 9వ తరగతి విద్యార్థి టి.బాలాజీ, అండర్-19 సాఫ్ట్‌బాల్‌లో పదో తరగతి విద్యార్థిని టి.దీపిక, అండర్-14లో హ్యాండ్‌బాల్‌లో 8వ తరగతి విద్యార్థి ఎం.యువరాజు, అండర్-17 క్రికెట్‌లో 10వ తరగతి విద్యార్థి పి.మనోజ్, అండర్-14,30కేజీ కరాటేలో 7వ తరగతి విద్యార్థిని కె.హిమజలు ఉండిపోవడం జరిగింది. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలుర సత్యవేడు విద్యార్థులకు నగదు బహుమతి అందించినందుకు గాను పాఠశాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పాఠశాలలో జరుగుతున్న జిల్లా స్థాయి రగ్బీ ఎస్‌జీఎఫ్ గేమ్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి వివిధ మండలాల నుంచి వివిధ పాఠశాలల నుంచి దాదాపు 300మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు భోజన వసతి కల్పించుట కొరకు విరాళాలు అందజేసిన ఓల్డ్ స్టూడెంట్ శాంత కుమార్, కరాటే కోచ్ బాబు, ఆర్టీసీ డ్రైవర్ లక్ష్మీనాథ్, హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న బాలచంద్రారెడ్డి, శ్రీపతిబాబు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు, మండల కన్వీనర్ ప్రవీణ్‌రెడ్డిలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి సభనుద్దేశించి విద్యార్థుల ఆటల ద్వారా ఆరోగ్యాన్ని తద్వారా మానసిక ఆరోగ్యాన్ని చేకూర్చుకోగలుగుతారని ఆటల ద్వారా క్రమశిక్షణ అలవడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలోఎస్‌జీఎఫ్ సెక్రటరీ బాబు, సత్యవేడు నియోజకవర్గ ప్రెసిడెంట్ బి.కుమార్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలుర సత్యవేడు వ్యాయామ ఉపాధ్యాయుడు ఏ.మురళి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎస్‌ఎంసీ చైర్మన్ నందిని, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పరమశివం, నాయకులు శశి నాయుడు, ప్రభాకర్‌రెడ్డి, షణ్ముగం, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కంచి భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేవీబీ పురం మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు

కేవీబీ పురం, అక్టోబరు 28 ప్రభాతవార్త:



కేవీబీ పురం మండలం ఆదరం గ్రామ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు రామాంజులనాయుడు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, కావున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పక సభ్యత్వ నమోదు చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో కేవీబీ పురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామాంజులనాయుడు, తిరుపతి పార్లమెంట్ రైతు అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జి కనపర్తి, గోపినాథ్‌రెడ్డి, యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్‌రెడ్డి, సీనియర్ నాయకులు రమేష్, బాబ్జి, మహేంద్రనాయుడు, మునస్వామి, ఆదరం గ్రామ పంచాయతీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నగరి, అక్టోబరు 28 ప్రభాతవార్త:



మున్సిపల్ పరిధి రామాపురం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నింద్ర మండలం ఇరుగువాయికి చెందిన చిరంజీవి(54) అనే వ్యక్తి మృతి చెందాడు. ఆయన నగరి టీఆర్ కండ్రిగ వద్ద అక్వేరియం షాపు నడుపుతున్నాడు. ప్రతి రోజు డిగ్రీ కళాశాల మైదానంలో వాకింగ్ చేయడం అక్కడి నుంచి రామాపురంకు బైక్‌పై వెళ్లి అక్కడున్న ఆవులకు అరటి పండ్లు ఇచ్చి పంచితం తీసుకురావడం, ఇరుగువాయిలోని వినాయక స్వామికి పూజలు చేసి షాపుకు రావడం ఇతనికి అలవాటు. అలాగే సోమవారం కూడా రామాపురం వద్ద పంచితం తీసుకుని నగరి వైపు వస్తుండగా వెనుక వైపు నుంచి అతి వేగంగా వచ్చిన సిమెంటు ట్యాంకర్ అదుపు తప్పి చిరంజీవిని ఢీకొనడంతో టైరు కింద అతను పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెంది శరీరం ఛిద్రమైంది. ఈ మేరకు సీఐ మహేశ్వర్ కేసు నమోదు చేశారు. ట్యాంకర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కాగా చిరంజీవికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## రీ సర్వే సమస్యలు పరిష్కారానికే గ్రామసభ

### -ఆర్.ఎస్. డి.టి. మోహన్‌బాబు

తిరుపతిరూరల్, అక్టోబర్28 ప్రభాతవార్త:



రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యలు పరిష్కారానికి 'గ్రామ సభ'లు నిర్వహిస్తున్నట్లు రీ సర్వే ఉప తహశీల్దార్ మోహన్‌బాబు తెలిపారు. రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యలపై 'గ్రామ సభ'ను సోమవారం తిరుపతిరూరల్ పాతకాల్వ గ్రామ పంచాయతీలో నిర్వహించారు. ఈ గ్రామసభలో భూ సర్వేపై రెండు సమస్యలు, భూ సమస్యలపై మూడు సమస్యలు తలెత్తినట్లు తెలిపారు. పక్కాగా భూ కొలతలు నిర్వహించటానికే రీ సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2వేల గ్రామాలలో రీసర్వే చేసామని, రీ సర్వేలో తలెత్తిన సమస్యలను పరిష్కరించుటకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ హేమకుమార్, వీఆర్వో రాఘవరెడ్డి, సచివాలయ సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE PRL. CIIVL JUDGE(SENIOR DIVISION), CHITTOOR**
**E.A.NO. 55 OF 2024**
**E.A.NO. 48 OF 2024**
**E.P.NO. 105 OF 2018**
**O.S.No.175 of 2007**

**Between:**
A.Purushotham ...**Claim Petitioner**
**And:**
1.K.Manohar (D.Hr/Auction Purchaser)
2. G.D.Gajapathi (died)
3. G.Kanthamma
4. G.D.Nancharamma (died)
5. G.Bhuvaneswari (J.Ds. 1 to 4)
...**Respondents**

**NOTICE TO THE RESPONDENTS 3 AND 5**

**To,**
**1. G.KANTHAMMA**
W/o late G.D.Gajapathi
**2. G.BHUVANESWARI**
D/o late G.D.Gajapathi.
**Both are residing at**
D.No.13-31, Rangachari Street, Chittoor, Chittoor District.
**Sir,**
Please take notice that the claim Petitioner A.Purushotham has filed E.A.No.55 of 2024 against you and K.Manohar request this Hon'ble court; a) to declare the right and title of the petitioner over the EP /claim petition schedule mentioned property; b) by setting aside the sale certificate dt.25.3.2024 issued by this Hon'ble court in favour of 1st respondent/ D.Hr/Auction Purchaser. The said EA is posted to 08.11.2024 for appearance. If you have got any objection you may appear on **08.11.2024 at 10.30 A.M.** either in person or through an Advocate and file your objections, if you fail to do so the matter will be decided ex-parte.
**Hearing Date: 08-11-2024.**

**SRI C.SURESH REDDY,**
**SRI P.PRAKASH REDDY**
Advocates for Claim Petitioner
Chittoor Dt.26.10.2024

# పోలీసులూ సమాజంలో భాగస్వాములే!

## సామాజిక కార్యక్రమాల్లో సహకరించండి - డివైయస్‌పి నరసింహమూర్తి



శ్రీకాళహస్తి,అక్టోబర్ 28 ప్రభాతవార్త : పోలీసులూ సమాజంలో భాగస్వాములని, ప్రజల్లో ఒకరని,పోలీసులు చేపట్టే సామాజిక కార్యక్రమాలలో ప్రజలు సహకరించాలని డివైయస్‌పి నరసింహామూర్తి పిలుపు నిచ్చారు. సోమవారం ఎంజిఎం కార్పొరేట్ ఆసుపత్రిలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం వారోత్సవాలు ముగింపు సందర్భంగా భారీ ఎత్తున రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు.వన్‌టౌన్ సిఐ డి.గోపి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరైన డివైయస్‌పి నరసింహామూర్తి మాట్లాడుతూ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం ప్రశాంతమైనదని ఇక్కడ శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులతో ప్రజలు సహకరించాలన్నారు. పోలీసులు కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని వాటి అమలుకు ప్రజలు సహకరించాలన్నారు. ప్రతి దుకాణం,లాడ్జిల యజమానులు తమ వ్యాపార సంస్థల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డివైయస్‌పి పిలుపు నిచ్చారు. ఇక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి పోలీసులతో పాటు విద్యార్థులు, జర్నలిస్టులు సహకరించారన్నారు. నేడు ఎందరో ప్రమాదాలకు గురై రక్త సమస్యతో ప్రాణాలు కొల్పోతున్నారన్నారు.అలాంటి వారికి రక్తం ఎంతో అవసరమన్నారు. పోలీసు అమరవీరులకు నివాళులతో పాటు భవిష్యత్తులో ఎవరైనా బాధితులను ఆదుకొనుటకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

**101 మంది రక్త దానం:**

శ్రీకాళహస్తి పోలీసు సబ్ డివిజన్ పిలుపు మేరకు 101 మంది రక్తదానం చేసినట్లు వన్‌టౌన్‌సిఐ డి.గోపి వివరించారు. ఈ రక్త దాన శిబిరం ఏర్పాటుకు ఎంజిఎం డైరెక్టర్ గుడ్లూరు మయూర్ వారి సిబ్బంది సహకారం అభినందనీయం అన్నారు.రాబోవు రోజుల్లో మరెన్నో సామాజిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో సిఐలు డి.గోపి, రవినాయక్, వెంకటేశ్వర్లు, తిమ్మయ్య, ఎస్ఐలు, నరసింహారావు, ఈశ్వరయ్య,సిబ్బంది పాల్గొన్నారు.

# అరటిలో విరివిగా కూరగాయల తోటలో పెంచుకోవాలి

## డాక్టర్ వైఎస్ఆర్ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు



వెంకటగిరి, అక్టోబర్ 28 ప్రభాతవార్త : పెరటిలో విరివిగా కూరగాయల తోటలు పెంచుకోవాలని డాక్టర్ వైఎస్ఆర్ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ బిజి రాజులు తెలిపారు. వెంకటగిరిలోని కృషి విజ్ఞాన కేంద్రం నందు పోషకాహార తోటల ఏర్పాటుపై అంగన్వాడి టీచర్స్‌కు శిక్షణ, సామర్థ్య పెంపుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అంగన్వాడి సెంటర్స్‌లో పోషకాహార తోటలు పెంచుకొని వాటి ద్వారా పండించిన ఆకు కూరలు, కూరగాయలు చిన్న పిల్లలు, కిషోర బాలికలు, గ్రామాణ మహిళలకు అందించటం ద్వారా పోషకాహార సమస్యలు నివారించవచ్చు అని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోషణ్ వాటిక కార్యక్రమం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అంగన్వాడి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు నాగార్జున సాగర్, సిడిపిఓ శంషాద్ బేగం పోషకాహారం తోటల ఏర్పాటు పై గ్రామ స్థాయిలో రైతు సేవ కేంద్రాల ద్వారా మండల వ్యవసాయ అధికారి ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. కృషి విజ్ఞాన్ కేంద్రం అధిపతి డా. డి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కెవికె ద్వారా సాంకేతిక సహకారం ఈ కార్యక్రమంలో భాగంగా తప్పక అందిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమం ప్రోగ్రాం ఇంచార్జ్ గృహ పోషక ఆహారం శాస్త్రవేత్త డా. బి. విజయశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకొని గ్రామాలలో పోషకాహార భద్రతకు ఐసిడిఎస్ సిబ్బంది అవగాహన కల్పించాలని తెలియజేశారు. తదుపరి అంగన్వాడి టీచర్స్‌కు కూరగాయ విత్తనాల కిట్స్ అందించటం జరిగింది. అంతే కాకుండా బయో ఫోర్టిఫయిడ్ రకాలైన ఎన్ఎల్ఆర్ 3238 అధిక జింకు కలిగిన వరి రకం విత్తనాలు రైతులకు అందించారు. ఈ రకం పైరు పై పడిపోని, రబి, ఎడగారు కాలానికి అనువైన, స్వల్ప కాలిక, అధిక జింకు కలిగిన వరి రకం అని వివరించారు. ఈ కార్యక్రమంలో కెవికెలు డా. బి.విజయశ్రీ, డా. డి.తిరుపాల్, డా.పి. నాగార్జున రెడ్డి, డా. ఐ.రాజీవన, దక్కిలి, వెంకటగిరి మండలం అంగన్వాడి టీచర్స్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## నాటుసారా తయారీదారులు అరెస్ట్ : డీఎస్పీ



కుప్పం, అక్టోబర్ 28 ప్రభాతవార్త : కుప్పం మండలంలో అక్రమంగా గంజాయిసాగు, నాటుసారా తయారు చేస్తున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు కుప్పం డీఎస్పీ పార్థసారథి పేర్కొన్నారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పం మున్సిపల్ పరిధి చీగలపల్లికి చెందిన రామచంద్రప్ప (43), సామగుట్టపల్లి ఎస్సీ కాలనీకి చెందిన హనుమంతు (49)లు వేర్వేరుగా వారి ఇల్లు, పొలాల వద్ద 19 గంజాయి మొక్కలు సాగుచేస్తున్నారని తెలియడంతో అర్బన్ సిఐ జిటి నాయుడు, ఎస్సై ప్రవీణ్‌లు సిబ్బందితో కలిసి గంజాయి మొక్కలు, 1.50కిలోల గంజాయిని సీజ్ చేశారన్నారు. అలాగే గుండ్లపల్లి వద్ద నాటుసారా తయారు చేసే గుండ్లమడుగుకు చెందిన ఎం రాజా (52), తమిళనాడు రాష్ట్రం కళ్యాణపారకొళ్లి గ్రామానికి చెందిన ఎస్ రాజా (50)లను అరెస్ట్ చేసి వారినుంచి తొంభై లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈసందర్బంగా అర్బన్ సిఐ జిటి నాయుడు, ఎస్సై ప్రవీణ్, సిబ్బందిని డిఎస్పీ అభినందించారు.

## జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఘన స్వాగతం



రేణిగుంట, అక్టోబరు 28 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంపులు శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు రేణిగుంట విమానాశ్రయంలో సోమవారం ఘన స్వాగతం లభించింది. ఆయనకు స్వాగతం పలికిన వారిలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపరెడ్డిమౌర్య, డీఎం హెచ్‌వో శ్రీహరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, జనసేన జిల్లా పార్టీ అధ్యక్షుడు హరిప్రసాద్, శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి కోట వినుత, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శాప్ చైర్మన్ రవి నాయుడు, టీడీపీ రాష్ట్ర బీసీ ప్రధాన కార్యదర్శి రెడ్డివారి గురువారెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, రేణిగుంట ఇన్‌చార్జి తహసీల్దార్ శ్యాంప్రసాద్, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక టీడీపీ సీనియర్‌నేతలు మునిచంద్రారెడ్డి, చిన్నారెడ్డి, మునస్వామినాయుడు, మహబూబ్ బాషా, డి.పుష్పనాథం, నెల్లూరు సుబ్రహ్మణ్యం, కిరణ్, నాధముని, కొరియర్ రవి, కన్నన్‌రెడినడ,సిటీ సుబ్రహ్మణ్యం, చెంచయ్యనాయుడు, చలపతినాయుడు, ధనంజయ నాయుడు తదితరులు ఉన్నారు.

## యస్వీయూకు ప్రవాస భారతీయులు 10 లక్షల విరాళం



తిరుపతి విద్య,అక్టోబర్ 28 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర విద్యాలయంలోదూరవిద్య ద్వారా మనోవిజ్ఞాన శ్శాం అభ్యసించి అమెరికాలోని చికాగోలో వుంటున్న ఫ్రీ లెన్స్ జర్నలిస్టు,ఇండియా ట్రిబ్యూన్ పత్రిక మాజీ ఎడిటర్ జె వి లక్ష్మణరావు వారి తల్లిదండ్రులు పేరున దూరవిద్య శాఖ లో తరగతి గది కోసం 10 లక్షల విరాళం కలిగిన చెక్కునూ ఉపకులపతి ఆచార్య అప్పారావు రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడుకు అందించారు.వీరు తణుకులో పుట్టి ,ఇడియన్ ఎక్స్ప్రెస్,హిందూ,డెక్కన్ క్రానికల్,అమెరికాలో ఇండియన్ ట్రిబ్యూన్ తదితర ఆంగ్ల పత్రికలకు ఎడిటర్‌గా దేశవిదేశాలలో దాదాపు 65 సంవత్సరాల సర్వీస్ అందించారు.లక్ష్మణ్ రావు,భారత తొలి ప్రధాని నెహ్రూ మీడియా సలహాదారు మోరిస్ తోను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గత ముఖ్యమంత్రులు నందమూరి తారకరామారావుకి చెన్నారెడ్డికి మీడియా సలహాదారులుగా పనిచేశారు.అదే విధంగా అప్పటి రాష్ట్రపతి ఏపిజె అబ్దుల్ కలాంని,ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని వారి అమెరికా పర్యటనలో ఇంటర్వ్యూలు చేసి ప్రచురించి ఉన్నారు.లక్ష్మణరావు 87 సంవత్సరాల వయసులో యస్వీయూలో దూరవిద్య ద్వారా విద్యను అభ్యసించడం సోమవారం విరాళం ఇవ్వడం పట్ల వర్సిటీ ఉపకులపతి, రిజిస్ట్రార్లు కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డా॥పాకనాటి హరికృష్ణ యాదవ్,ఇంజనీర్ తాండవ కృష్ణ,డిడిఇ డైరెక్టర్ ఆచార్య తవమణి,డిఆర్ సునీత,గాలం దయసాగర్ మరియు డిడిఈ భాస్కర్ ఎస్సి,ఎస్టి పరిశోధక విద్యార్థుల సంఘం అధ్యక్షుడు మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు అధికారులతో జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సమీక్ష

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 28 ప్రభాతవార్త : ఈ నెల 29వ తేది మంగళవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ఇంచార్జి మంత్రి, రెవెన్యూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని జేసి శుభం బన్సల్, రెవెన్యూ అధికారి పెంచల కిషోర్‌లు పేర్కొన్నారు. సోమవారం జిల్లా అధికారులతో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్‌తో కలిసి సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రగతి నివేదికలు సంక్షిప్తంగా పూర్తి సమాచారం ఉండాలని, జిల్లా అధికారులు అందరూ తప్పకుండా హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కష్టపడిన వారికి పదవులు ఇవ్వండి

### -జిల్లా ఇన్‌ఛార్జిమంత్రికి తెలుగుయువత వినతి



తిరుపతి,అక్టోబర్ 28ప్రభాతవార్త: పార్టీకోసం మూడుదశాబ్ధాలుగా కష్టపడి పనిచేస్తున్న నేతలు, కార్యకర్తలకు అధికారంలో ఉన్నసమయంలో పదవులు ఇవ్వాలని తెలుగుయువత నాయకులు విజ్ఞప్తి చేశారు. నామినేటెడ్ పదవులతో పార్టీని మరింత బలోపేతం చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ప్రజలు కూడా ప్రభుత్వం పట్ల, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలుగుయువత అధికార ప్రతినిధి కంకణాల రజినీకాంత్‌నాయుడు తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జిమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా సోమవారం సాయంత్రం తిరుపతికి వచ్చిన మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఆత్మీయంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛంతో, దుశ్శాలువతో కంకణాల రజినీకాంత్ నాయుడు, తెలుగుయువత నేతలు గాలిపవన్, జలపోతు చంద్ర, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చిన వినతులను సత్వరం పరిష్కరించండి

### కమిషనర్ ఎన్. మౌర్య

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 28 ప్రభాతవార్త : నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను సత్వరం పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులను కమిషనర్ ఎన్. మౌర్య ఆదేశించారు. నగర పాలక సంస్థలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 40 వినతులు ప్రజలు సమర్పించారన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి ఆయా విభాగాల అధికారులకు అర్జీలను కేటాయించారు. అన్ని అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్స్ నాగేంద్ర, ఉద్యాన శాఖ అధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, ఈఈలు, ఏసిపిలు, శానిటరీ సూపర్‌వైజర్లు తదితరులు ఉన్నారు.

## అధికారులను బ్లాక్‌మెయిలింగ్ చేస్తే సహించం : టీడీపీ



దక్కిలి,అక్టోబర్28 ప్రభాతవార్త : కొంత మంది అధికారులను టార్గెట్ చేస్తూ వారి విధులకు ఆటంకం కలిగిస్తూ సంఘాల నాయకులు బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడితే సహించేది లేదని దక్కిలి మాజీ జెడ్పీ టీసీ సభ్యుడు ఏలేశ్వరం రామ చంద్రయ్య నాయుడు,దక్కిలి మండల టీడీపీ అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డిలు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం మండలంలోని పలు గ్రామాల టీడీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొంత మంది అధికారులను బెదిరించడం,స్వార్ధ ప్రయోజనాలు కోసం సంఘాలకు చెందిన నాయకులు ప్రెస్‌మీట్‌లు పెట్టి ఎప్పుడో విషయాలను కొత్తగా జరిగినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో రెవిన్యూ శాఖలో ఎన్నో జరిగిన అవతవకలుపై విచారించి రైతులకు న్యాయం చేయాలని ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పటికే జీవో విడుదల ఇచ్చారని చెప్పారు.ఈమేరకు అన్నీ గ్రామాలలో రెవిన్యూ సదస్సులు జరుగుతున్నట్లు తెలియజేశారు. సీఎం చంద్రబాబు పాలనలో అవినీతి రహిత పాలన గతంలో జరిగింది...నేడు అదే పాలన జరుగుతున్నట్లు స్పష్టం చేశారు.గత ప్రభుత్వంలో రెవిన్యూ రికార్డులు పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని... ఆరికార్డులు సరిచేసేందుకు ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో ఎవ్వరూ ఉన్నారో తెలుసుకుని రికార్డులను సరిచేసి అసలైన లబ్దిదాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు.అధికారులను నిత్యం బెదిరిస్తూ సోంత ప్రయోజనాలకు వాడుకోవాలని సంఘాల నాయకులు పాల్పడితే ఊరుకునేది లేదని తెలిపారు. అనంతరం వారు ఈ విషయాలు గురించి స్థానిక తహశీల్దారు ఎం.శ్రీనివాసులుతో చర్చించి వినతి పత్రం అందజేశారు. కూటమి నాయకులు నిజాయితీ అధికారులకు ఎప్పుడూ అండగా ఉంటామని చెప్పారు.ఈసమావేశంలో టీడీపీ నాయకులు చంద్రారెడ్డి,పులి జనార్ధన్ రెడ్డి,హర్‌నాధ్‌నాయుడు,పోకురు రమేష్‌నాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ పై విచారణ



కోట,అక్టోబర్ 28 ప్రభాతవార్త : కోట మండలం అల్లంపాడు గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్రమణ్యంపై సోమవారం అధికారులు విచారణ చేపట్టారు. గతంలో ఆయన పై పలు ఆరోపణలు రావడంతో ఆయనను కూటమి ప్రభుత్వం విధుల నుంచి తోలగిచింది. ఈ క్రమంలో ఆయన కోర్టు ద్వార స్టేటస్ కో తీసుకొని మళ్లీ విధులు చేరాడు.దీంతో ఎంపిడివో వేణు ,ఎపిడిఒ వర ప్రసాద్, ఎపిఒ పూర్ణిమ్మలు విచారణ జరిపారు. అయితే విచారణకు వచ్చిన అధికారి ఇరు వర్గాలను రెచ్చికోట్టేవిధంగా మాట్లాడం తమకు ఏంతో బాధ కలిగించిందని ఉపసర్పంచ్ దేవరాల రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ అధికారిపై జిల్లా కలెక్టర్‌కు తాను పిర్యాదు చేస్తానని చెప్పారు. విచారణకు వచ్చిన అధికారులు ఏంతో సహనంతో ఇరు వర్గాల వాదనను వినాల్సిన అవసరం ఉందన్నారు.కానీ ఆ అధికారి వ్యవహరించిన తీరు బాదకరమన్నారు.

## జిల్లా స్థాయి చెకుముకి పోటీలలో జీవీఎస్ పాఠశాల విద్యార్థులు



గూడూరు, అక్టోబర్ 28 ప్రభాతవార్త : స్థానిక రెండవ పట్టణంలోని జీవీఎస్ పాఠశాలల విద్యార్థులు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి పోటీలలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ సైన్స్ పై అవగాహన కలిగించుట కొరకు మూఢనమ్మకాలను నిర్మూలించడం కోసం గత 34 సంవత్సరాలుగా చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ టాలెంట్ టెస్ట్ పాఠశాల స్థాయి మండల స్థాయి జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో జరుగుతుందని తెలియజేశారు. మండల స్థాయిలో మొదటి బహుమతి అదే విధంగా జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించిన జీవిస్ శంకరయ్య మెమోరియల్ హై స్కూల్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా చక్కటి ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పవన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో సైన్స్ పట్ల అవగాహన కలిగించడం కొరకు జన విజ్ఞాన వేదిక వారు నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాము, ఉపాధ్యాయులు మల్లికార్జున, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు చెంచు నారాయణ, ప్రభాకర్, సుమన్ రెడ్డి, రజనీకాంత్, సురేష్ పాల్గొన్నారు.

## విద్యుత్తు సబ్ డివిజన్‌లో పారదర్శకంగా సేవలు : ఎ.డి.



కోట,అక్టోబర్ 28 ప్రభాతవార్త : కోట విద్యుత్ సబ్ డివిజన్‌లో ప్రజలకు పారదర్శంగా సేవలు అందిస్తామని నూతనంగా కోట సబ్‌డివిజన్ కు విద్యుత్తు శాఖ ఎడిగా వచ్చిన పి.చిన్నయ్య చెప్పారు. ఆయన మండలంలోని విద్యా నగర్‌లో సోమవారం ప్రభాతవార్తతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు ఉచితంగా ఇళ్లకు విద్యుత్తును అదిస్తుందని పేర్కొన్నారు. అయితే చేనేత కార్మికులు తమ కార్యాలయాంలో కాని సచివాలయాంలోకాని దరకాస్తులు చేసుకోవాల్సి ఉందన్నారు. 100 యూనిట్లు లోపాల విద్యుత్ ను వినియోగిస్తే అటువంటి వారికి ఉచితం వర్తిస్తువన్నారు. 101 యూనిట్లు దాటితే వారు బిల్లు చెల్లించాల్సి వస్తోందన్నారు.. సబ్ డివిజన్ పరిధిలో టాన్స్‌పార్మర్లు కాలిపోతే రైతుల నుంచి కొంత మంది ఉద్యోగులు లంచం డిమాండు చేస్తన్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయని విషయాన్ని ఆయన దృష్టికి తీసుకొని వేళ్లిగా ఏఒక్క రైతు తమ ఉద్యోగులకు ఒక్క పైసా కూడా లంచంగా ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.వ్యసాయ కనెక్షన్లు విషయంలో జాప్యం జరగడంలేదని చెప్పారు.సౌర విద్యుత్తు వినియోగానికి ముందుకు వచ్చే వారికి పీఎం సూర్య ఘర్ పథకంలో భాగంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలిస్తున్నాని చెప్పారు. మూడు కిలోవాట్లకు రూ 78వేల వరకు ఆర్దిక సాయం చేస్తున్నాయన్నారు. ఈ కనెక్షన్లు వల్ల లబ్దిదారులతో పాటు ప్రభుత్వానికి ప్రయోజనమే ఉంటుందన్నారు.ఇప్పటికే ఎస్సీ,ఎస్టీలో 200 యూనిట్లు లోపు వినియోగించే వారికి విద్యుత్తు సరఫరా చేస్తున్నామన్నారు.ఇళ్లలో వినియోగించే విద్యుత్తు కంటే సోలార్ ద్వారా ఎక్కువ ఉత్పిత్తి జరిగితే ఆ మిగులను డిస్కంకు తిరిగి అమ్మి సొమ్ము చేసుకోవచ్చన్నారు.

## ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

### - కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్



కుప్పం, అక్టోబర్ 28 ప్రభాతవార్త : ప్రజా సమస్యలను అధికార యంత్రాంగం సకాలంలో పరిష్కరించాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. సోమవారం కుప్పం కడ కార్యాలయం సమావేశపు హాలులో ప్రజా సమస్యల పరిషా ్కర వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలనుంచి నేరుగా సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్ణీత కాల వ్యవధిలో ఆయా శాఖలకు సంబంధించిన అరీ ్జలను అధికారులు విధిగా పరిష్కరించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం ఏ విధంగా ఉంటుందో అర్జీదారులకు తగు ఎండార్స్‌మెంట్ అందించాలన్నారు. త్వరలోనే గ్రామాల్లో సమస్యల పరిష్కారంకు ప్రజా దర్బార్ కార్యక్రమానికి శ్రీకారం చుడతానని పేర్కొన్నారు. నేరుగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని సాధ్యమైనంత త్వరగా వాటిని అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిఇలు పురుషోత్తం, గురవారెడ్డి, ప్రభాకర్, తహశీల్దార్ చిట్టిబాబు, ఎంపిడిఒ సాయిలహరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కంచి పీఠాధిపతికి కాణిపాకం గణనాథుని ప్రసాదాలు



కాణిపాకం, అక్టోబర్ 28 ప్రభాతవార్త: కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారికి కాణిపాకం గణనాథుని తీర్థ, ప్రసాదాలు, శేషవస్త్రాలను సోమవారం ఆలయ అధికారులు అందజేశారు. పెనుమూరు మండల కలికిరికొండ దేవస్థానంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీదేవి, భూదేవి సమేత మహావిష్ణుమూర్తి ఆలయ కుంభాభిషేకం కార్యక్రమంకు విచ్చేసిన విజయేంద్ర సరస్వతి స్వామివారిని కాణిపాకం ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, అర్చకులు మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి తీర్థ, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. అనంతరం స్వామి అశీసు ్సలు అందుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెట్ కోదండపాణి, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, బాలాజినాయుడు, ఆలయ అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదుతో టీడీపీని బలోపేతం చేద్దాం

### -తెలుగు తమ్ముళ్ళకు ఎంపీ దగ్గుమళ్ళ, ఎమ్మెల్యే మురళీలు పిలుపు

తవణంపల్లె, అక్టోబర్ 28 ప్రభాతవార్త: టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు అంచనాలకు మించిన టీడీపీ సభ్యత్వ నమోదు చేయించి పార్టీని మరింతగా బలోపేతం చేద్దామని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్‌లు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని తెల్లగుండ్లపల్లెలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశానికి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్‌లు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆవశ్యకతపై పార్టీ శ్రేణులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతున్నట్లు తెలిపారు. గతం కంటె ఈసారి సభ్యత్వ నమోదును పెంచాల్సి అవసరం వుందన్నారు. పార్టీ సభ్యత్వంతోనే పార్టీ పటిష్టత సాధ్యమన్నారు. అలాగే ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలబెట్టడమే తమ ముందన్న లక్ష్యమన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి పలు రకాల ప్రయోజనాలను పార్టీ కల్పించిందన్నారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా పలువురు లక్ష రూపాయలు చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర చౌదరి,మండల అధ్యక్షుడు దిలీప్, ప్రధాన కార్యదర్శి మధుకుమార్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌నాయుడు, సర్పంచ్ మాధవి, నాయకులు సునీల్ చౌదరి, శ్రీధర్ యాదవ్, ఎంపీటీసీ రాధాకృష్ణలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధికి రూ.50లక్షలు రాస్ విరాళం



.శ్రీకాళహస్తి, అక్టోబర్ 28 ప్రభాతవార్త : రాష్ట్రీయ సేవాసమితి తిరుపతి ప్రధాన కార్యదర్శి డా.ఎస్. వెంకటరత్నం, సంయుక్త కార్యదర్శి ఎం.మమత మరియు సూపరింటెండెంట్ వి.నాగరాజులు సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వంగా అమరావతిలో కలసి విజయవాడలో ఆగస్టు, సెప్టెంబర్‌లో సంభవించిన వరద విపత్తు బాధితులకు పునరావాసం కోసం సిఎం సహాయనిధికి విరాళంగా రూ.50లక్షలు డిడిని 20సూత్రాల పథకం మాజీ ఛైర్మన్ టి.శేషసాయిబాబుల సహోంలో అందించారు.ఈసందర్భంగా రాస్ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.వెంకటరత్నం మట్లాడుతూ సామాజిక ప్రయోజనం కోసం తమ వంతు సహకారం అందించడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన అసంఖ్యాక లబ్దిదారులకు ముఖ్యంగా సంస్థ యొక్క మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు, రైతు లబ్దిదారులకు మరియు తిరుపతి ఐసిడిఎస్ ప్రాజెక్టు యొక్క అంగన్‌వాడీ కార్యకర్తలు సహాయకులకు సంస్థ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా రాస్ మునిరత్నం, సిబ్బందిని సిఎం చంద్రబాబునాయుడును అభినందించారు.

## వైదిక కమిటీ ఏర్పాటులో వంశపారంపర్యదారులకు చోటు లేదా?

### అభ్యంతరం తెలిపిన మిరాశి దారులు!

శ్రీకాళహస్తి,అక్టోబర్ 28 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏర్పాటు చేసిన వైదిక కమిటిలో ఎంతోకాలం ఆదాయ వనరులు లేని రోజుల్లో కాపాడిన మిరాశి దారులు,వంశపారంపర్యం ఉన్న వారికి అవకాశం కల్పించకపోవటం శోచనీయ మని వంశపారంపర్యఅర్చక,స్థలపతి, స్థానిక మిరాశిదారులు వైదికాగమ పీఠాదిపతి అయిన డాక్టర్ స్వామి నాధన్ గురుకుల్,ఎంఎంకె పరశురాం గురుకుల్ ఆలయ ఇఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్‌కు వినతి పత్రం అందించారు. శ్రీకాళహస్తీశ్వరాలయం సి నెం.33460/రెవెన్యూ 59/ఇ/2024-ఎ7/ ఎస్‌కెహెచ్‌టిడి తేది 06.10.2024న జారి చేసిన ఉత్తర్వులలో వైదిక కమిటిని ప్రకటించారు. దానిని పరిశీలించాలని అభ్యర్థించారు.ఈ కమిటి సంప్రదాయ పద్దతులు,దిట్టంకు సంబంధించి,పూజలు, అభిషేకాలు హోమాలకు సంబంధించి చర్చించి చర్యలు తీసుకొనుటకు నియమించిన వైదిక కమిటిలో వంశపారంపర్య గురుకుల్స్‌కు అవకాశం కల్పించలేదన్నారు.అంతేకాక ఇప్పటి వరకు ఆచార వ్యవహారాలు,పూజలు, సంప్రదాయాలకు సంబంధించి మిరాశి దారులు పర్యవేక్షించే వారు. కానీ నేడు ఏర్పాటుచేసిన వైదిక కమిటిలో అవకాశం కల్పించకపోవటం శోచనీయం అన్నారు.

## ట్రాఫిక్ నియమాలు పాటించకుంటే కఠిన చర్యలు



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 28 ప్రభాతవార్త : ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. సోమవారం పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 36 మంది ముద్దాయిలను 4వ అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు నందు హాజరు పరచగా జడ్జి గ్రంథి శ్రీనివాస్ ఒక్కొక్కరికి 10 వేల రూపాయిలు చొప్పున మొత్తం 36 మందికి 3.60 లక్ష జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు సుబ్బారెడ్డి, సంజీవ్ కుమార్, రవీంద్రలు వెల్లడించారు . అధిక మోతాదులో మద్యం సేవించిన ఆటో డ్రైవర్లు చంగల్ రాయులు (34), మునిగోపాల్ (44)లకు మూడు రోజులు జైలు శిక్ష విధించారు. టూ విల్లర్ డ్రైవర్లు ఎ. గురువయ్య (40), సిద్దయ్య (41), కన్నయ్య (50), గిరిబాబు (41)లకు రెండు రోజులు జైలు శిక్ష విధించారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పనితీరును జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు అభినందించారు. తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బాధ్యతతో విదులు నిర్వర్తించాలని సూచించారు.

## టాస్క్‌ఫోర్సులో రక్తదాన శిబిరం



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 28 ప్రభాతవార్త : అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సోమవారం ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్సులో రక్తదానం శిబిరం నిర్వహించారు. టాస్క్‌ఫోర్సు ఎస్పి పి. శ్రీనివాస్ నేతృత్వంలో 29 మంది టాస్క్‌ఫోర్స్ ఉద్యోగులు రక్తదానం చేశారు. తిరుపతి రుయా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జి డాక్టర్ హరిత, తమ సిబ్బందితో టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. తరువాత ఎస్పి పి. శ్రీనివాస్ మాట్లాడుతూ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు పురస్కరించుకుని నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిభిరం నిర్వహించినట్లు తెలిపారు. రక్తదానం చేయడం వల్ల శరీరంలో కొత్త రక్తం చేరుతుందన్నారు. దాని వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. రక్తదానం చేసిన వారిలో డీఎస్పి జి. బాలిరెడ్డి, ఆర్ఐ కె. సురేష్ కుమార్ రెడ్డి, సిఐ సురేష్ కుమార్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు. రక్తదానం చేసిన వారికి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఉద్యోగులు పండ్లును పంపిణీ చేశారు.